ANN తెలుగు
Follow: @ANNTELUGU
27-05-2025
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 174 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


## పుష్కరాలు సక్సెస్
### వైభవంగా ముగిసిన సరస్వతీ పుష్కరాలు
- రాత్రి నవరత్న మాత హారతిలో పరిసమాప్తం
- భక్తులను విశేషంగా అలరించిన డ్రోన్ షో
- 11 రోజులుగా క్యూ.. చివరి కావడంలో పోటెత్తిన భక్తులు
- త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాల కోసం బారులు
- కర్ణాటక, మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్ నుంచి తరలివచ్చిన ప్రజలు

వివరాలు 3లో



టాప్ న్యూస్

## కేసీఆర్, కవితల బంధం క్లోజ్!
- వాళ్ల బంధం ఇక అతికే అవకాశమే లేదు
- ఆయనకు ఎదురు చెప్తే దగ్గర కూడా రానీయడు
- కేసీఆర్ టార్గెట్ చేసిన వ్యక్తి అంతు చూసే దాకా వదలడు
- అది ఎవరైనా సరే, ఎక్కడున్నా సరే వదిలిపెట్టడు
- మనం ట్యూన్ కావాల్సిందే తప్ప ఆయన మనకు ట్యూన్ కాలేడు
- కవిత ఎపిసోడ్‌పై బీజేపీ ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు




02

## ఆస్కార్ నటులు
- సినీ దిగ్గజాలపై బండ్ల గణేశ్ సెటైర్
- మీడియా ముందుకు నిన్న అల్లు అరవింద్, నేడు దిల్ రాజు



02

## కవితతో ఎంపీ దామోదర్ కీలక భేటీ
- కొత్తపార్టీని ఆపేందుకేనా?
- మూడు గంటలకు పైగా చర్చలు



03



## జలదిగ్బంధంలో ముంబై
- 107 ఏళ్లలో ఇదే అత్యధిక వర్షపాతం
- బీఎంసీ పరిధిలో 200 మి.మీ. దాటిన వర్షపాతం

వివరాలు 2లో



## భారత్ ను ద్వేషించడమే పాక్ ఏకైక లక్ష్యం
- మనకు హాని కలిగించే మార్గాన్వేషణలో నిరంతర ప్రయత్నం
- భారత్ లక్ష్యం పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి
- గుజరాత్ పర్యటనలో పాకిస్తాన్ పై ప్రధాని మోదీ ఫైర్

వివరాలు 5లో



## ఆధార్ ఈ సంతకం
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత స్పీడప్
- ఇక 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సంతకం అమలు
- ఆర్మూర్, కూసుమంచి ఎస్ఆర్వో ఆఫీస్‌ల్లో అమల్లోకి
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వివరాలు 3లో

# 30న ఫైనల్
## పీసీసీ కూర్పు.. మంత్రుల మార్పుచేర్పులు



- అగ్రనేతలతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ వరుస భేటీలు
- రాహుల్ తో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భేటీ
- తెలంగాణ పదవుల భర్తీపై కేసీ వేణుగోపాల్ చర్చలు
- పీసీసీ కార్యవర్గంపై.. అదే రోజు ప్రకటన
- మే 31 లేదా జూన్ 2న కొత్త మంత్రివర్గం?
- కొందరి పదవుల్లో కోత.. మరికొందరికి ప్రమోషన్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై హైకమాండ్ పూర్తిస్థాయి లో దృష్టి పెట్టింది. అంతా సెట్ అయింది.. ఇక ప్రకటనే తరువాయి అని భావించినా అగ్రనేతలు తుది నిర్ణయానికి మరో డేట్ ఫిక్స్ చేశారు. ఈనెల 30న మరోసారి ఢిల్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి కి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు హైకమాండ్ సూచించింది. ఆ రోజే.. పదవుల లెక్క తేలిపోనుంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. సోమవారం టీపీసీసీ కార్యవర్గానికి ఆమోదముద్ర పడుతుందని భావించినా, అనూహ్యంగా వాయిదా పడింది. కాగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మర్యాద పూర్వకంగా కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిసి, తెలంగాణ రాష్ట్ర అంశాలను రాహుల్ గాంధీకి వివరించారు. వీలైనంత త్వరగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేయాలని రాహుల్ గాంధీని కోరానని.. త్వరగా చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని మహేష్ కుమార్ అన్నారు. - మహా, ఢిల్లీ

వివరాలు 3లో



## ఆ మంత్రులు ఔట్
### కొత్తగా.. వారే

వివరాలు 3లో

# మళ్లీ విచారణకు రండి
## మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు
- ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కీలక పరిణామం
- ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- నెలాఖరులో యూకే, అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారైంది: కేటీఆర్
- తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని లిఖిత పూర్వక సమాచారం
- ఇప్పటికే ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపడం ఇది రెండోసారి



**మహా:** ఫార్ములా ఈకారు రేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు మరోసారి అనుహ్య పరిణామం ఎదురైంది. ఈ కేసులో దర్యాప్తు పెంచిన ఏసీబీ తాజాగా ఆయనకు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు సోమవారం నోటీసులు పంపారు. ఇప్పటికే ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపడం ఇది రెండోసారి. అయితే ఫార్ములా ఈకార్ రేసు వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ పేర్లను నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఉన్నారు. అది నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(A), 13(2)తో పాటు ఐపీసీ 409,120(B) సెక్షన్ల కింద నమోదు చేశారు. ఏసీబీ కేసు నమోదు చేయటంతో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండా హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.55 కోట్లను విదేశీ సంస్థకు

మిగతా 2లో



## రాష్ట్రంలో ఉప ఎన్నికలు
### 200 జెట్‌స్పీడ్‌తో గెలవడం ఖాయం
- మనోడు ఎవడో.. వెన్నుపోటు పొడిచేదెవరో తెలిసింది
- పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు కర్రు కాల్చి వాత పెట్టాలి
- ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం
- అపరిచితుడు చిత్రంలోని రాము, రెమో లాగా రేవంత్ రెడ్డి తీరు: మాజీ మంత్రి కేటీఆర్
- బీజేపీ అభివృద్ధిని బహిర్గతం చేయడానికి సాధారణ వర్షం చాలని విమర్శ
- రూ. 430 కోట్లతో చర్లపల్లి రైల్వే స్టేషన్ పైకప్పును కూడా నిర్మించలేకపోయిందని ట్వీట్

02

# ఆయన దేవుడెలా అవుతాడు
## దెయ్యాలకు నాయకత్వం వహించిన కేసీఆర్
- దెయ్యాలను రాష్ట్ర పులి మేరల నుంచి తరిమికొట్టాలి
- వందమంది కేసీఆర్ లు అడ్డం వచ్చినా తెలంగాణ ప్రగతి ఆగదు
- మా ప్రతి పథకం దేశానికి రోల్ మోడల్
- పదేళ్ళ పాలనలో కేసీఆర్ ఉద్యోగులకు పదివేల కోట్ల బకాయిలు పెట్టారు
- మేం అందులో ఎనిమిది వేల కోట్లు క్లియర్ చేశాం
- అచ్చంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి

**మహా :** దెయ్యాలకు నాయకత్వం వహించిన కేసీఆర్ దేవుడు ఎలా అవుతాడు? దెయ్యాలను రాష్ట్ర పులి మేరల నుంచి తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం అచ్చంపేటలో పలు విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభించి, మరి కొన్ని సబ్ స్టేషన్లు కు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ

మిగతా 2లో



## విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద భీమా

వివరాలు 2లో



## ప్రైవేట్ హాస్పిటల్లపై నిఘా
- ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవు
- వర్షా లు ప్రారంభం.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం
- రాష్ట్రంలో కొవిడ్‌తో ఇప్పటికైతే ప్రమాదమేమీ లేదు
- అధికారులకు హెల్త్ మినిస్టర్ దామోదర ఆదేశాలు
- కొవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై అధికారులతో సమీక్ష

వివరాలు 5లో




## కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టం
### ఈ ఏడాది అన్ని చెరువుల్లో చేపలు వదలాలి
- ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీల ఎప్పుడు నెరవేరుస్తారు?
- ఎవరి కడుపు నింపేందుకు అందాల పోటీలు పెడుతున్నారు?
- అందాల పోటీల కోసం రూ. 200 కోట్లు ఖర్చు పెడుతున్నారు
- రైతులకు మాత్రం రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదు
- మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు

**మహా:** అందాల పోటీల కోసం రూ. 200 కోట్లు ఖర్చు పెట్టారు కానీ రైతులకు విత్తనాలు ఇవ్వడం లేదని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం

మిగతా 3లో

# జలదిగ్బంధంలో ముంబై

## 107 ఏళ్లలో ఇదే అత్యధిక వర్షపాతం

### బీఎంసీ పరిధిలో 200 మి.మీ. దాటిన వర్షపాతం



**మహా :** దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరం చరిత్రలో ఓ కొత్త అధ్యాయం లిఖించబడింది. గత 107 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా మే నెలలో అత్యధిక వర్షపాతం నమోదై, సరికొత్త రికార్డు సృష్టించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వానలతో నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంది. జనజీవనం స్తంభించిపోగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబయి సహా పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసి, పరిస్థితి తీవ్రతను స్పష్టం చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకే బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని అనేక ప్రాంతాలు 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతంతో తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా దక్షిణ ముంబయిపై వరుణుడు ప్రతాపం చూపించాడు. నారిమన్‌పాయింట్ స్టేషన్‌లో అత్యధికంగా 252 మి.మీ., బైకుల్లా ఈవార్డులో 213 మి.మీ., చారిత్రక కొలాబా ప్రాంతంలో 207 మి.మీ., డు టకి స్టేషన్‌లో 202 మి.మీ. చొప్పున రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. మెరైన్ లైన్స్, చందన్‌వాడీ, మెమోన్‌వాడ, వర్లీ వంటి ప్రాంతాలు కూడా 170 మి.మీ. పైబడిన వర్షపాతంతో అతలాకుతలమయ్యాయి.

**శతాబ్దపు రికార్డు బద్దలు**

కొలాబా అబ్జర్వేటరీ గణాంకాల ప్రకారం, ఈ మే నెలలో ఇప్పటివరకు నమోదైన మొత్తం వర్షపాతం 295 మిల్లీమీటర్లు. ఇది గడిచిన 107 సంవత్సరాలలో మే నెలలో నమోదైన అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. ఇంతకుముందు 1918వ సంవత్సరంలో మే నెలలో 279.4 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డవ్వగా, ఆ శతాబ్దపు రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. ఈ అసాధారణ వర్షపాతం నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

**ముందే వచ్చిన నైరుతి**

ఈసారి నైరుతి రుతుపవనాలు మహారాష్ట్రను పది రోజులు ముందుగానే పలకరించడం ఈ భారీ వర్షాలకు ఒక కారణంగా వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా జూన్ 5వ తేదీ తర్వాత ప్రవేశించే రుతుపవనాలు, ఈసారి మే చివరి వారంలోనే తమ ప్రభావాన్ని చూపించడం మొదలుపెట్టాయి. 1990 తర్వాత ఇంత త్వరగా ముంబయిని రుతుపవనాలు తాకడం ఇదే తొలిసారని నిపుణులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం**

భారీ వర్షాల నేపథ్యంలో ఐఎండీ ముంబయి, థానే, రాయగఢ్, రత్నగిరి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం ఉదయం వరకు ఈ హెచ్చరికలు అమల్లో ఉంటాయని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బీఎంసీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. పలుచోట్ల ట్రాఫిక్ జామ్‌లు, లోకల్ రైళ్ల సేవలకు అంతరాయం కలగడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే 24 గంటలు అత్యంత కీలకమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# ఆయన దేవుడెలా అవుతాడు

## దెయ్యాలకు నాయకత్వం వహించిన కేసీఆర్

- దెయ్యాలను రాష్ట్ర పులి మేరల నుంచి తరిమికొట్టాలి
- వందమంది కేసీఆర్ లు అడ్డం వచ్చినా తెలంగాణ ప్రగతి ఆగదు
- మా ప్రతి పథకం దేశానికి రోల్ మోడల్
- పదేళ్ళ పాలనలో కేసీఆర్ ఉద్యోగులకు పదివేల కోట్ల బకాయిలు పెట్టారు
- మేం అందులో ఎనిమిది వేల కోట్లు క్లియర్ చేశాం
- అచ్చంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి



(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభలో ప్రసంగించారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆయన కూతురు కవిత ఇప్పుడు చెబుతుంది కానీ ఎన్నికల ముందే రాష్ట్ర ప్రజలు ఈ దయ్యాలను వదిలించుకొని రాష్ట్ర ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారన్నారు. మరో రెండు దశాబ్దాల పాటు ఈ రాష్ట్ర అభివృద్ధికి కావలసిన ప్రణాళికలను ప్రజా ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు వరుస సంక్షేమ పథకాలు, ఉద్యోగ, స్వయం ఉపాధి కార్యక్రమాలతో బాగుపడుతున్నారని, తన దగ్గరకు ఎవరూ రావడం లేదని కేసీఆర్ దుఃఖపడుతున్నాడన్నారు. మేం తెచ్చిన ప్రతి పథకం దేశానికి రోల్ మోడల్ గా మిగులుతుందన్నారు. 10 సంవత్సరాలు పాలించిన కేసీఆర్ ఉద్యోగులకు పదివేల కోట్ల బకాయిలు పెడితే, మేం అందులో ఎనిమిది వేల కోట్ల ఉద్యోగుల బకాయిలు క్లియర్ చేశామని చెప్పారు. 10 ఏళ్ళ పాటు పాలించిన కేసీఆర్ ఒక్కసారి కూడా గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేకపోయారని ఎద్దేవా చేశారు. మేము అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే లక్ష ప్రభుత్వ ఉద్యోగాల కలను సాకారం చేశామన్నారు. 57 వేల ఉద్యోగాలు భర్తీ చేసాం మరో 30,000 ఉద్యోగాలు ప్రాసెస్ లో ఉన్నాయని తెలిపారు. అర్హత ఉండి ఉద్యోగం రాని యువత కోసం 9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాన్ని తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల కాలంలో వాయిదాల పద్ధతిన మాఫీ చేస్తే అది ఆనాడు బ్యాంకు వడ్డీలకే సరిపోయిందని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరంభంలోనే ఒకేసారి 22 వేల కోట్ల రైతు రుణమాఫీ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రైతులే కాదు భూమిలేని కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ప్రతి ఏటా 12 వేల రూపాయలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఆర్థికంగా నిలబడేలా ప్రతి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఎంతటి ఆర్థిక భారం అయినా సరే రాష్ట్రంలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల ఖర్చు భారం తగ్గించేందుకు రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 24 గంటల ఉచిత కరెంటు అందజేస్తున్నామని, రైతుల పక్షాన ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు 12,500 కోట్లు చెల్లిస్తుంది ఇది రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న నిబద్ధత అని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈ ప్రాజెక్టు జీవో ఇచ్చిందే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనే డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. మూడు నెలలు ఆరు నెలలు రెండు సంవత్సరాల్లో పూర్తిచేసే ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేసినట్టు అచ్చంపేట నియోజకవర్గం లో 45వేల పంపు సెట్లకు సోలార్ పవర్ ఏర్పాటు చేయడంపై విద్యుత్ శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ఇది ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం 10 కాలాలపాటు కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని డిప్యూటీ సీఎం అన్నారు.

# విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద భీమా

## దేశ చరిత్రలోనే ఓ రికార్డు

### ప్రభుత్వ ఆలోచనకు అద్దం పడుతుంది.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**మహా :** విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ప్రజాభవన్ లో ఎన్ పీడీసీఎల్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు తో పాటు విద్యుత్ శాఖలో నరేష్ భార్యకు కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోని సాధ్యమైందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తమ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అయింది అన్నారు. ప్రమాద బీమా మరియు కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు, మానవీయ కోణానికి అద్దం పడుతుంది అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కోటి రూపాయల పైబడి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల అందరిలో ఓ కొత్త భరోసా నింపుతుంది అన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన సీఎండీ వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి విద్యుత్తు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మళ్లీ విచారణకు రండి

## మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

- ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కీలక పరిణామం
- ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- నెలాఖరులో యూకే, అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారైంది: కేటీఆర్
- తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతానని లిఖిత పూర్వక సమాచారం
- ఇప్పటికే ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపడం ఇది రెండోసారి

(మొదటిపేజీ తరువాయి)

బదిలీ చేశారనే ఆరోపణలను అనుసరించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**హెచ్ఎండీఏ రూ.55 కోట్లు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా ఈ రేసింగ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ మేరకు విదేశీ సంస్థతో ఒప్పందం చేసుకుంది. 2023లో తొలిసారిగా ట్యాంక్ బండ్ పై భారీ ఏర్పాట్లు చేసి ఈవెంట్ నిర్వహించారు. 2023 ఫిబ్రవరి 11న నిర్వహించిన మొదటి ఫార్ములా ఈ కార్ల పోటీకి మంచి స్పందన కూడా వచ్చింది. ఇది సక్సెస్ కావటంతో 2024 ఫిబ్రవరి 10న మరోసారి (సెషన్ 10) నిర్వహించేందుకు ఫార్ములా ఈ ఆపరేషన్ (ఎఫ్ఈవో)తో పురపాలక పట్టణాభివృద్ధి సంస్థ (ఎంఏయూడీ) 2023 అక్టోబరులో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు హెచ్ఎండీఏ రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించింది.

**స్పందించిన కేటీఆర్**



దీనిపై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. దర్యాప్తు సంస్థలకు సహకరిస్తానని కేటీఆర్ ట్వీట్ చేశారు. చట్టాన్ని గౌరవించే ఓ పౌరుడిగా, కేసు అంతా పూర్తిగా రాజకీయ వేధింపు అయినప్పటికీ.. కచ్చితంగా దర్యాప్తు సంస్థలకు సహకరిస్తానని చెప్పారు. ఇప్పటికే పలు కార్యక్రమాలకు సంబంధించి లండన్, అమెరికాకు వెళ్లాలని ప్లాన్ చేసుకున్నానని అన్నారు. ఆ ప్రోగ్రామ్స్ అన్ని పూర్తి చేసుకుని.. తిరిగి వచ్చిన వెంటనే దర్యాప్తు సంస్థల ముందు అటెండ్ అవుతానని చెప్పారు. ఏసీబీ అధికారులకు కూడా ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా తెలిపానని ఆయన ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఇదే సమయంలో 48 గంటల క్రితం నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి డబ్బు సరఫరా చేసినందుకు ఈడీ ఛార్జిషీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పేరు కనిపించింది. మనీలాండరింగ్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి ప్రమేయం ఉందని ఏ ఒక్క బీజేపీ నాయకుడు కూడా సీఎంపై ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని కేటీఆర్ నిలదీశారు.



# ఆస్కార్ నటులు

- సినీ దిగ్గజాలపై బండ్ల గణేశ్ సెటైర్
- మీడియా ముందుకు నిన్న అల్లు అరవింద్, నేడు దిల్ రాజు

**హైదరాబాద్, మహా:** "ఆస్కార్ నటులు, కమలహాసన్లు ఎక్కువైపోయారు. వీళ్ళ నటన చూడలేకపోతున్నాం" అంటూ బండ్ల గణేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఆయన ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై స్పష్టత లేనప్పటికీ, దిల్ రాజు ప్రెస్ మీట్ జరుగుతున్న తరుణంలో ఈ ట్వీట్ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఒకరోజు దిల్ రాజు.. ప్రెస్ మీట్ పెట్టగా దీంతో నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. బండ్ల గణేశ్ వ్యాఖ్యలు దిల్ రాజును ఉద్దేశించే కావొచ్చని పలువురు సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు.

# కేసీఆర్, కవితల బంధం క్లోజ్!

## వాళ్ల బంధం ఇక అతికే అవకాశమే లేదు





- ఆయనకు ఎదురు చెప్తే దగ్గరకూడా రానీయడు
- కేసీఆర్ టార్గెట్ చేసిన వ్యక్తి అంతు చూసే దాకా వదలడు
- అది ఎవరైనా సరే, ఎక్కడున్నా సరే వదిలిపెట్టడు
- మనం ట్యూన్ కావాల్సిందే తప్ప ఆయన మనకు ట్యూన్ కాలేడు
- కవిత ఎపిసోడ్‌పై బీజేపీ ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు

**మహా:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత అంశాలపై మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తనను తాను ఓ చక్రవర్తిలా, రాజులా భావిస్తుంటాడు.. ఒక్కసారి ఎవరిపైనైనా ఆయనకు నెగిటివ్ అభిప్రాయం పడితే ఇక అంతే. అది ఎన్నటికీ మారదని అన్నారు. కేసీఆర్‌తో కవిత బంధం ఇక అతికే అవకాశమే లేదు' అని వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కామెంట్స్ చేశారు. కేసీఆర్, కవితల బంధం ఇక ముగిసినట్లేనని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు. కేసీఆర్‌కు ఎదురుచెప్పే వారు ఆ తర్వాత ఆయన దరిదాపుల్లోకి కూడా వెళ్లలేరని వివరించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి దాదాపు 20 సంవత్సరాలుగా కేసీఆర్ వెన్నంటే ఉన్నానని, ఆయనను చాలా దగ్గరి నుంచి చూసిన వ్యక్తిగా తాను ఈ మాటలు చెబుతున్నానని పేర్కొన్నారు. కేసీఆర్‌కు మనం ట్యూన్ కావాల్సిందే తప్ప ఆయన మనకు ట్యూన్ కారని.. కూలిపోయే వరకు నేనే గొప్ప అనుకునే వ్యక్తి కేసీఆర్ అన్నారు. వాస్తవాన్ని అంగీకరించే మూడ్ లో కేసీఆర్ లేరని చెప్పారు.

**ఎక్కడున్నా సరే వదిలిపెట్టడు..**

ఆయన ఛత్రంలో ఇమడని వారిని కేసీఆర్ దగ్గరకు రానివ్వరని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాచరికపు పోకడ, నియంతృత్వం, నమ్ముకున్న వారిని నట్టేట ముంచే పద్ధతి, వ్యక్తులను వాడుకుని వదిలేసే నైజం ఫలితమే రాజకీయంగా కేసీఆర్ ను బొందపెట్టిందని చెప్పారు. కవితకు వాళ్ల కుటుంబానికి మధ్య ఎక్కడో ఏదో తేడా వచ్చిందని ఇక అతికే అవకాశమే లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎవరినైనా టార్గెట్ చేస్తే మరో పని పెట్టుకోడని, తను టార్గెట్ చేసిన వ్యక్తి అంతు చూసేదాకా వదలడని ఈటల చెప్పారు. అది ఎవరైనా సరే, ఎక్కడున్నా సరే వదిలిపెట్టడని అన్నారు. ఒకవేళ అవసరార్థం మళ్లీ దగ్గరికి తీసినా సరే సమయం వచ్చినపుడు తొక్కేస్తాడని తేల్చిచెప్పారు. ఒకసారి విభేదాలు పొడచూపితే వాటిని మర్చిపోయి కలిసి ముందుకు సాగే వ్యక్తి కాదని పేర్కొన్నారు. కూలిపోయే పరిస్థితి వచ్చినా సరే నేనే గొప్ప అనుకునే వ్యక్తి కేసీఆర్ అని ఈటల తెలిపారు. వాస్తవాన్ని అంగీకరించే మూడ్‌లో కేసీఆర్ లేరని ఈటల వివరించారు.

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు

## 200 జెట్‌స్పీడ్‌తో గెలవడం ఖాయం

- మనోడు ఎవడో.. వెన్నుపోటు పొడిచేదెవరో తెలిసింది
- పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు కర్రు కాల్చి వాత పెట్టాలి
- ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం
- అపరిచితుడు చిత్రంలోని రాము, రెమో లాగా రేవంత్ రెడ్డి తీరు: మాజీ మంత్రి కేటీఆర్
- బీజేపీ అభివృద్ధిని బహిర్గతం చేయడానికి సాధారణ వర్షం చాలని విమర్శ
- రూ. 430 కోట్లతో చర్లపల్లి రైల్వే స్టేషన్ పైకప్పును కూడా నిర్మించలేకపోయిందని ట్వీట్

**మహా:** దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీని పాలమూరు ప్రజలు నమ్మి బొక్కబోర్లా పడ్డారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తే గద్వాల్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగరవేస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 200 జెట్‌స్పీడ్‌తో తాము గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయకుండా రేవంత్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శలు చేశారు. ఈ శతాబ్దపు అతి పెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయ హస్తమని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత పదేళ్ల తమ హయాంలో రాష్ట్రానికి బలమైన పునాది వేశామని ఉద్ఘాటించారు. ఇంకా ఎన్ని రోజులు చూడాలి కాంగ్రెస్ దరిద్రాన్ని అని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. కుండ




పగిలితే పగిలింది కుక్కబుద్ధి తెలిసింది అన్న చందంగా మనోడెవడో మనతో ఉంటూనే వెన్నుపోటు పొడిచేదెవడో తెలిసిందన్నారు. పదిమంది నేతలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారని.. వారికి కర్రు కాల్చివాత పెట్టాలని హెచ్చరించారు మాజీ మంత్రి కేటీఆర్. మనతోనే ఉండి మనకే వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారని మండిపడ్డారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. నాడు నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం చేశామని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిందలు, దందాలు, చందాలు చేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి చాలాసార్లు మాట మార్చారని మండిపడ్డారు. అపరిచితుడు చిత్రంలోని రాము, రెమోలాగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జూన్ మాసంలో బీఆర్ఎస్ మెంబర్ షిప్ ప్రారంభిస్తామని ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్, బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. మరోవైపు బీజేపీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మే నెలలో కురిసిన సాధారణ వర్షపాతం బహిర్గతం చేసిందని ఎద్దేవా చేశారు. భవనం పైకప్పునే సరిగ్గా నిర్మించలేకపోయిన వాళ్లు.. కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారంటూ వీడియోను షేర్ చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ట్విట్టర్ వేదికగా.. 'బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బహిర్గతం చేయడానికి సాధారణ వర్షం చాలు.. హైదరాబాద్‌లో 430 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ అయినా ఢిల్లీ విమానాశ్రయం పైకప్పులైనా, బీజేపీ మార్క్ 'అభివృద్ధి'ని చెప్పడానికి సాధారణ వర్షం సరిపోతుంది. బీజేపీ ప్రభుత్వం సరిగ్గా పైకప్పును కూడా నిర్మించలేకపోవడం విచారకరం.. కానీ, బీజేపీ వాళ్లు కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన షేప్ షిఫ్టర్ పైకప్పుల అద్భుతమైన సరికొత్త డిజైన్లను ఏ ఏజెన్సీ పరిశీలిస్తుందో చూడాలి మరి?!' అంటూ సెటర్లు వేశారు.





# పుష్కరాలు సక్సెస్

## వైభవంగా ముగిసిన సరస్వతీ పుష్కరాలు

- రాత్రి నవరత్న మాత హారతిలో పరిసమాప్తం
- భక్తులను విశేషంగా అలరించిన డ్రోన్ షో
- 11 రోజులుగా క్యూ.. చివరి కావడంలో పోటెత్తిన భక్తులు
- త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాల కోసం బారులు
- కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తరలివచ్చిన ప్రజలు

**మహా:** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఆధ్యాత్మికతతో శోభిల్లిన సరస్వతీ పుష్కరాలు ముగిసాయి. చివరి రోజు త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాల కోసం వేలాదిమంది భక్తులు పోటెత్తారు. వేకువ జామునుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. ఈ 15న ప్రారంభమైన పుష్కరాల్లో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు సరస్వతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పుణ్య స్నానాలు ఆచరించి సరస్వతి దేవికి మొక్కులు చెల్లించి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా అధికారికంగా నిర్వహించుకున్న పుష్కరాలు కావడంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రూ.35 కోట్ల నిధులతో ఏర్పాట్లు చేసింది. కొన్ని పనులు సమయానికి పూర్తి కాకపోయినప్పటికీ పలు సార్లు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పుష్కరాలను దేవాదాయ శాఖ, ప్రభుత్వం యంత్రాంగం నిర్వహించింది.

**పోటెత్తిన భక్తులు**

పుష్కరాలు చివరి రోజు భక్తులు పుష్కర స్నానం ఆచరించి అధిక సంఖ్యలో ముక్తేశ్వర స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు సెల్ఫీలు, దిగుతూ శివయ్య సన్నిధిలో భక్తి పారవశ్యంతో ఉప్పొంగి పోయారు. 12 రోజులుగా గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ త్రివేణి సంగమంలో పుష్కర స్నానం, స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం త్రాగునీరు సరఫరా, త్రివేణి సంగమం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు అధికారులు. పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగింది, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఓఆర్ఎస్, ఏదైనా అస్వస్థతకు గురైన భక్తులకు వైద్య సేవలు అందించారు. పంచాయతీరాజ్ విభాగం మూడు షిఫ్టుల వారీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ డబ్ల్యూఎస్ శాఖ ద్వారా మంచినీరు, మరుగుదొడ్ల నిర్వహణ చేశారు. విద్యుత్తు శాఖ ద్వారా నిరంతరం విద్యుత్తు సరఫరా చేశారు. సోమవారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఈ మహా పర్వదినంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు, ఈఓ మహేశ్ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సోమవారం సరస్వతి ఘాట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు దంపతులు, ప్రత్యేక స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ దంపతులు పుష్కర స్నానం ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సంకల్పం, తర్పణం, ఆర్ఘ్యం, సూర్యనమస్కారాలు చేశారు. ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ బాపు సోమవారం పుష్కర స్నానం ఆచరించి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు.

**డ్రోన్ షో దృశ్యాలు అద్భుతం..**

ఆదివారం 3.50 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం చివరి రోజు కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సరస్వతీ పుష్కరాలు ముగింపు సందర్భంగా త్రివేణి సంగమంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన డ్రోన్ షో భక్తులను విశేషంగా అలరించింది. త్రివేణి సంగమ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అద్భుతమైన డ్రోన్ షో దృశ్యాలను వీక్షించారు. సాయంత్రం 7:45 గంటలకు సరస్వతి ఘాట్‌లో నవరత్న మాల హారతి నిర్వహించబడింది, ఇది పుష్కరాల ముగింపును సూచించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ నాగ ఫణిశర్మ సందేశం, వేద మంత్రోచ్ఛారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. సప్త హారతులు, ప్రత్యేక కార్యక్రమాలతో ఈ ఉత్సవం వైభవంగా ముగిసింది.





# ఆధార్ ఈ సంతకం

## రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత స్పీడప్

- ఇక 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ సంతకం అమలు
- ఆర్మూర్, కూసుమంచి ఎస్ఆర్వో ఆఫీస్‌ల్లో అమల్లోకి
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**మహా:** స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్‌ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ ఆధార్‌ఈ సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. అవినీతిరహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో ఆధార్ ఈ సంతకం కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావాలన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి స్లాట్ బుకింగ్ విధానం, పని భారం అధికంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌లపై సమీక్షించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ ఆర్ వోలను నియమించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

# 30న ఫైనల్

## పీసీసీ కూర్పు.. మంత్రుల మార్పుచేర్పులు

- అగ్రనేతలతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ వరుస భేటీలు
- రాహుల్ తో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భేటీ
- తెలంగాణ పదవులభర్తీపై కేసీ వేణుగోపాల్ చర్చలు
- పీసీసీ కార్యవర్గంపై.. అదే రోజు ప్రకటన..
- మే 31 లేదా జూన్ 2న కొత్త మంత్రివర్గం?
- కొందరి పదవుల్లో కోత.. మరికొందరికి ప్రమోషన్

**ఢిల్లీ, మహా:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై హైకమాండ్ పూర్తిస్థాయి లో దృష్టి పెట్టింది. అంతా సెట్ అయింది.. ఇక ప్రకటనే తరువాయి అని భావించినా అగ్రనేతలు తుది నిర్ణయానికి మరో డేట్ ఫిక్స్ చేశారు. ఈనెల 30న మరోసారి ఢిల్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు హైకమాండ్ సూచించింది. ఆ రోజే.. పదవుల లెక్క తేలిపోనుంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. సోమవారం టీపీసీసీ కార్యవర్గానికి ఆమోదముద్ర పడుతుందని భావించినా, అనూహ్యంగా వాయిదా పడింది. కాగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మర్యాద పూర్వకంగా కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిసి, తెలంగాణ రాష్ట్ర అంశాలను రాహుల్ గాంధీకి వివరించారు. వీలైనంత త్వరగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేయాలని రాహుల్ గాంధీని కోరానని.. త్వరగా చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని మహేష్ కుమార్ అన్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఇప్పటికే ఒకటి, రెండుసార్లు తమ అభిప్రాయాలను అధిష్టానానికి తెలిపామని అన్నారు. తెలంగాణ కేబినెట్ లో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని అధిష్టానానికి కోరామని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అందుబాటులో లేకపోవడంతో పీసీసీ కార్యవర్గ ప్రకటనను 30కి వాయిదావేశారు. ఆ రోజే మంత్రివర్గం, టీపీసీసీ లపై హైకమాండ్ లెక్క తేల్చేయనుంది.

**తుది కసరత్తులో కేసీ వేణుగోపాల్**

రాష్ట్ర కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. సోమవారం క్లారిటీ వస్తుందని భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిజీబిజీగా ఉండటంతో మంత్రి వర్గ విస్తరణపై స్పష్టత నాలుగైదురోజులు వాయిదాపడింది. పీసీసీ కార్యవర్గంపై ఇప్పటికే ఒక క్లారిటీ ఉంది.అయినా ఖర్గే వచ్చాకే పీసీసీ కార్యవర్గాన్ని ఫైనల్ చేయనున్నారు. హైకమాండ్ సూచనల నేపథ్యంలో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వరుసగా కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ అవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. కొత్తగా మంత్రివర్గంలో చోటుదక్కించుకునే ఆ లక్కీ సిక్స్ హ్యాండ్స్ ఎవరనే చర్చ నడుస్తోంది. రేసులో వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజగోపాల్ రెడ్డి, పీ సుదర్శన్ రెడ్డి పేర్లు వినిపిస్తుండగా ప్రస్తుతం ఎమ్మెల్సీ, సినీనటి విజయశాంతి పేరు కూడా తెరమీదకు వచ్చింది. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి తనకు కేటాయించాలని ఆమె అధినాయకత్వాన్ని కోరుతున్నట్టు సమాచారం. ఈ వర్గంలో ఆది శ్రీనివాస్ కూడా ఆశిస్తున్నారు. మరోవైపు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మూడు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయుగ్ సమావేశంలో పాల్గొన్నారు. తర్వాత రాష్ట్రానికి నిధులు రాబట్టేందుకు ప్రధాని, మంత్రులను కలుస్తున్నారు. ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ని కలిశారు. సుమారు గంట పాటు పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించారు. అయితే ఖర్గే అందుబాటులో లేకపోవడంతో ఈనెల 30న తెలంగాణకు సంబంధించిన కీలక పదవులపై చిక్కుముడులు విప్పేసి ఆమోదముద్ర వేస్తామని హైకమాండ్ తేల్చిచెప్పింది. 30న ఫైనల్ అయితే మే 31 లేదా జూన్ 2న మంత్రివర్గ విస్తరణ జరగనుంది.

# ఆ మంత్రులు ఔట్

## కొత్తగా.. వారే

**హైదరాబాద్, మహా:** మంత్రివర్గ విస్తరణ కూడా దాదాపుగా ఓ కొలిక్కి వచ్చింది. వారంరోజుల్లో మంత్రివర్గ విస్తరణతో పాటు.. పీసీసీ పదవుల భర్తీకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కేసీ వేణుగోపాల్‌తో భేటీ సందర్భంగా కొత్తగా మంత్రివర్గంలోకి ఐదు లేదు ఆరుగురికి చోటు కల్పించడంపై నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. కుల గణన, బీసీ రిజర్వేషన్లకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీ, అదేబాటలో మంత్రివర్గ విస్తరణలోనూ సామాజిక న్యాయాన్ని పాటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఐదు మంత్రి పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికి ఒకటి ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అవకాశం కల్పించాలనే నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. కాగా ఓ సామాజిక వర్గానికి సంబంధించిన పదవిపై మాత్రం సందిగ్ధత నెలకొనగా, ఈనెల 30న తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**చాన్స్ దక్కేదెవరికి**

ఓసీ కేటగిరీలో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ఇక.. మంత్రివర్గంలో ఒకరిద్దరికి స్థానచలనం తప్పదనే చర్చ వినిపిస్తోంది. మంత్రులు గా తొలిగించిన వారికి పార్టీలో బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ఇప్పటికే వివాదాస్పద వ్యాఖ్యలతో విమర్శలకు గురైన మంత్రితో పాటుగా.. మరో మంత్రి పేరు తెర మీదకు వస్తోంది. ముగ్గురు మంత్రులున్న జిల్లాలో ఒక మంత్రిని తప్పించి డిప్యూటీ స్పీకర్ గా నియమించే ప్రతిపాదనపై చర్చ జరుగుతోంది. మరో సామాజికవర్గ మంత్రిపైనా మార్పుల్లో కోత పడొచ్చన్న చర్చ జరుగుతోంది. పలువురు మంత్రుల శాఖల్లో మార్పుచేర్పులు జరగనుండగా, శ్రీధర్ బాబుతో పాటు కొందరికి శాఖల్లో ప్రమోషన్ లభించవచ్చని ప్రచారం జరుగుతోంది.

# కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. లక్ష కోట్లకు టెండర్లు పిలిచి పనులు చేస్తున్నారు కానీ.. పేదలు, రైతులు అడిగితే రూపాయి లేదంటున్నారని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి ఎవరి కడుపు నింపేందుకు అందాల పోటీలు పెడుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతీ గ్రామంలో చెరువులకు నీళ్ళు ఇచ్చి ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించామని గుర్తు చేశారు. సోమవారం జిల్లాలోని నంగునూరు మండలం పాలమాకులలో కొరివి కృష్ణస్వామి, పండుగ సాయాన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు, శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రముఖుల విగ్రహాలను పెట్టుకుని గుర్తించుకుంటున్నామని.. ప్రముఖుల చరిత్రలు బయటకు వస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డ 1956 తర్వాత మొదటి మేయర్ కృష్ణస్వామి అని అన్నారు. పండుగ సాయన్న భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు.

**టెండర్లు పిలవడం లేదు..**

పెద్దోన్ని కొట్టు పేదలకు పెట్టాలనే నినాదంతో ఆయన పని చేశారన్నారు. స్వాతంత్రం వచ్చి 70 ఏండ్లు అయినా పేద ముదిరాజ్‌లకు సంక్షేమ పథకాలు అందడం లేదని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి కూడా సిద్ధమని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎవరి కడుపు నింపేందుకు అందాల పోటీలు నిర్వహిస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ కోసం రూ.4వేల కోట్లు ఖర్చు పెడుతారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లులు చెల్లిస్తారు. కానీ రైతులకు మాత్రం రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. చేపల పెంపకాన్ని భారీగా పెంచామన్నారు. సమైక్య రాష్ట్రంలో ఇక్కడి ప్రాజెక్‌లను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సగం జిల్లాలో చెరువుల్లో, కుంటల్లో చేపలు పోయలేదన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపల పెంపకం కోసం టెండర్లు పిలవడం లేదని మండిపడ్డారు. ఈ ఏడాది అన్ని చెరువుల్లో చేపలు వదలాలని.. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని హెచ్చరించారు. జనుము జీలుగు విత్తనాలు దొరకడం లేదన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం రూ.4 వేల కోట్లు ఖర్చు పెడుతారని, కాంట్రాక్టర్ల కోసం వేల కోట్లు ఖర్చు పెడుతారని... కానీ రైతులకు మాత్రం రైతు భరోసా డబ్బులు ఇవ్వడం లేదంటూ మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# కవితతో ఎంపీ దామోదర్ కీలక భేటీ

## కొత్తపార్టీని ఆపేందుకేనా?.. మూడు గంటలకు పైగా చర్చలు



**హైదరాబాద్, మహా :** నాలుగు రోజులుగా రాష్ట్రంలో కవిత రాజకీయ అడుగులే హాట్ టాపిక్. కవిత రాసిన లేఖ బయటపడటంతో బీఆర్ఎస్ లో అంతర్గత విభేదాలున్నాయన్న విషయం తేటతెల్లమైంది. కవిత కొత్త పార్టీ పెడుతుందన్న ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా ఊపందుకుంది. కేసీఆర్ దేవుడే అయినా.. ఆయన చుట్టూ దెయ్యాలున్నాయనడంపైనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ దెయ్యాలెవరు? ఆమె ఎవరిని ఉద్దేశించి లేఖలో అలా రాశారన్న విషయం చర్చనీయాంశమైంది. కాగా.. తాజాగా బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు దామోదరరావు సోమవారం కవితతో భేటీ అయ్యారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ లీగల్ సెల్ ఇంచార్జ్ గండ్ర మోహనరావు కూడా కవితతో సమావేశమయ్యారు. సుమారు మూడు గంటలపాటు ఈ భేటీ కొనసాగింది. కేసీఆర్ ఆదేశాలతో ఈ భేటీ జరగ్గా, భేటీలో కవితతో వారిద్దరూ ఏం మాట్లాడారు? ఏయే అంశాలపై ప్రస్తావించారన్న దానిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఆస్తులకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగిందా? కొత్త పార్టీ ఆలోచన విరమించుకోవాలని సూచించారా? లేక కవిత రాజకీయ ప్రయాణానికి కేసీఆర్ సూచించిన ప్రతిపాదనలను ఆమె ముందుంచారా? ఇంతకూ ఈ భేటీ లో ఏం జరిగిందనేది స్పష్టత రావాల్సి ఉంది.

Z కేటగిరీ

# బీఆర్ఎస్‌లో కొలిమంటుకున్నది

**కవిత రూపంలో ఉరుములు,మెరుపులు కనిపించినప్పుడే సమస్యను పరిష్కరించడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమైనట్టు విమర్శలు వస్తున్నవి. సమస్య చిలికి చిలికి గాలివానగా మారడం వెనుక కేసీఆర్ ' ఫ్యూడల్ 'పోకడలే కారణమన్న విమర్శలూ వస్తున్నవి.''మా పార్టీలో అంతర్గత ప్రాజాస్వామ్యం ఉంది.కేసీఆర్ కు ఎవరైనా ఉత్తరాలు రాయొచ్చు,సూచనలు,సలహాలు ఇవ్వవచ్చు'' అని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మే 24 న మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు 'దేవతా వస్త్రాలు' గానే పలువురు భావిస్తున్నారు.అంటే అవేవీ 'కనిపించవు' అని అర్థం. పార్టీలో ప్రజాస్వామ్యం ఉన్నట్టు పార్టీ స్థాపించిన పాతికేండ్ల తర్వాత గుర్తుకు రావడం ఒక కోణం.**



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

తెలంగాణ రాజకీయం తన చుట్టూ తాను తిరుగుతూ కవిత చుట్టూ తిరుగుతోంది. కవిత వార్త లేని పత్రికలు,ఛానళ్లు,వెబ్ సైట్లు,యూట్యూబ్ చానళ్లు,ఇతర సోషల్ మీడియా వేదికలు కనిపించడం లేదు. అందుక్కారణం ఆమె సాహసమే. బిఆర్ఎస్ అధినేత వైఖరిని ప్రశ్నించడమే. పాతికేండ్లలో ఈ పని చేసిన వాళ్ళెవరూ లేరు. బిఆర్ఎస్ పాలనలో 'సామాజిక తెలంగాణ' సాధించలేకపోయాం అని కవిత వదిలిన క్షిపణి నేరుగా కేసీఆర్ ను తాకింది.'సామాజిక తెలంగాణ' పై ఆమె చేసిన వ్యాఖ్యలపై పార్టీ విధానమేమిటో ఇప్పటివరకు చెప్పలేకపోవడం వెనుక,ఆ నినాదం అంటే కేసీఆర్ కు ఇష్టం లేకపోవడమే. ఆమె సంధించిన అస్త్రంపై పార్టీ సానుకూలమొ,వ్యతిరేకమో స్పష్టం చెయ్యలేని నిస్సహాయతలో కేసీఆర్ కూరుకుపోయారు. కవిత ఎపిసోడ్ పై ఎవరూ స్పందించకూడదని కేసీఆర్ 'ఫత్వా' జారీ చేశారు.కానీ సోషల్ మీడియాను ఎవరు ఆపగలరు.కేటీఆర్,కవిత అనుచరులు,మద్దతుదారుల మధ్య భీకర యుద్ధం జరుగుతోంది.మొత్తంమీద కేసీఆర్ నాయకత్వానికి కవిత అగ్ని పరీక్ష పెట్టారు.ఈ పరీక్షలో కేసీఆర్ ఎలా నెగ్గుకొస్తారో చూడవలసి ఉన్నది.

ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా బిఆర్ఎస్ పార్టీలో సంక్షోభం తలెత్తింది.ఈ సంక్షోభం ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ నుంచి తెలంగాణ భవన్ మీదుగా పార్టీ క్యాడర్ వైపు కొనసాగుతోంది.పార్టీ కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.కేటీఆర్,హరీష్ రావు,సంతోష్ జోగినపల్లి ఒక శిబిరంగా ఏర్పడినట్టు పార్టీ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కవిత రూపంలో ఉరుములు,మెరుపులు కనిపించినప్పుడే సమస్యను పరిష్కరించడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమైనట్టు విమర్శలు వస్తున్నవి.సమస్య చిలికి చిలికి గాలివానగా మారడం వెనుక కేసీఆర్ ' ఫ్యూడల్ 'పోకడలే కారణమన్న విమర్శలూ వస్తున్నవి.''మా పార్టీలో అంతర్గత ప్రాజాస్వామ్యం ఉంది.కేసీఆర్ కు ఎవరైనా ఉత్తరాలు రాయొచ్చు,సూచనలు,సలహాలు ఇవ్వవచ్చు'' అని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మే 24 న మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు 'దేవతా వస్త్రాలు' గానే పలువురు భావిస్తున్నారు.అంటే అవేవీ 'కనిపించవు' అని అర్థం.పార్టీలో ప్రజాస్వామ్యం ఉన్నట్టు పార్టీ స్థాపించిన పాతికేండ్ల తర్వాత గుర్తుకు రావడం ఒక కోణం. అయితే ఎమ్మెల్సీ కవిత లేవనెత్తిన అంశాలపై పార్టీ అధినేత స్పందన ఏమిటి?పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్పందన ఏమిటి?



> “ కవిత ఎపిసోడ్ పై ఎవరూ స్పందించకూడదని కేసీఆర్ 'ఫత్వా' జారీ చేశారు.కానీ సోషల్ మీడియాను ఎవరు ఆపగలరు.కేటీఆర్,కవిత అనుచరులు,మద్దతుదారుల మధ్య భీకర యుద్ధం జరుగుతోంది.మొత్తంమీద కేసీఆర్ నాయకత్వానికి కవిత అగ్ని పరీక్ష పెట్టారు. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా బిఆర్ఎస్ పార్టీలో సంక్షోభం తలెత్తింది.

> “ అయితే సాధారణంగా ఏ రాజకీయ పార్టీలో అయినా ఒక ముఖ్య నాయకుడు లేదా నాయకురాలు పార్టీ అధినేత వైఖరిని నేరుగా ప్రశ్నించినప్పుడు ఆ పార్టీ అధినేత లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా వారి తరపున దూత ఎవరయినా రంగంలో దిగి,సమస్య పెద్దదిగా మారకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. బిఆర్ఎస్ తో 'అవసరమయితే' తెగతెంపులు చేసుకునే దిశగా కవిత ప్రయాణం కనిపిస్తుంటే,కనీసం ఆమెతో కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావులలో ఎవరూ మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

> “ ఆమె,తనకు తానే పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయేందుకు తండ్రీ,కొడుకు,మేనల్లుడూ సన్నాహాలు చేస్తున్నట్టుగా కొని అనుమానాలున్నవి. ఇందులో హరీశ్ రావు పాత్ర స్వల్పమే.''కేసీఆర్ నిర్ణయమే శిరోధార్యం.కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పజెప్పినా నాకు సమ్మతమే''అని హరీష్ వ్యాఖ్యలు చేయగానే కేటీఆర్ హరీష్ రావు ఇంటికి వెళ్లి కలవడంతో 'సంక్షోభానికి' బీజం పడింది.కేటీఆర్ కు పగ్గాలు అప్పజెప్పడం కవితకు ఇష్టం లేకపోవచ్చు.

పార్టీలో జరుగుతున్నదేమిటి? బిజెపి,బిఆర్ఎస్ మధ్య బంధమేదో ఉన్నట్టు పార్టీ శ్రేణులు అనుమానిస్తున్నాయంటూ కవిత లేఖ రాస్తే,దాన్ని బహిరంగం చేసి సంక్షోభ పరిస్థితులకు కారణమైన వ్యక్తులెవరు?పార్టీ అధ్యక్షునికి పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఎవరయినా లేఖ రాస్తే దాన్ని అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సి ఉన్నది. కానీ ఆ లేఖను 'లీక్' చేసి,ముందుగా ఎంపిక చేసిన ఒక న్యూస్ ఛానల్ కు పంపి, బజారుకెక్కడం ఉద్దేశపూర్వకంగానే కవితను రాజకీయంగా అణచివేసే పథకం ఉన్నట్టు సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నవి. ఈ ఎపిసోడ్ లో కవిత ప్రతిష్ట దెబ్బతినే అవకాశాలేమీ లేవు.పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రతిష్ట మాత్రమే దెబ్బతిన్నది.ఆయన నిస్సహాయత వ్యక్తమయింది. కవిత ఎపిసోడ్ ఇన్ స్టంట్ గా,యాక్సిడెంటల్ గా జరిగిన పరిణామమే కాదు.ఆమె లిక్కర్ కేసులో జైలులో ఉన్నప్పుడే పురుడు పోసుకున్నట్టు తెలియవచ్చింది. బీజేపీ పొత్తు పెట్టుకోవాలని కేసీఆర్ అనుకుంటున్నారంటూ ఆమెకు కేటీఆర్,హరీశ్ రావు తెలియజేశారని,అందుకామె ససేమిరా వీల్లేదని నిరాకరించారని తెలుస్తోంది.తీహార్ జైలులో జరిగిన సన్నివేశాలు చాలా కాలానికి బయటకు వస్తున్నట్టు తెలియవచ్చింది.పార్టీ పాతికేండ్ల పండుగ పేరిట జరిగిన ఎల్కతుర్తి సభ తాజా సంక్షోభానికి ఒక కారణం మాత్రమే.కేటీఆర్ తన వారసుడని,వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగానే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారని,కేసీఆర్ ఆ సభకు ముందు కొందరు కుటుంబసభ్యుల ఎదుట మనసులో మాట చెప్పారని ప్రచారం జరుగుతోంది.హరీశ్ రావుతో మాట్లాడి ఇదే విషయాన్ని కన్విన్సు చేశారన్నది మరో ప్రచారం.మాజీ మంత్రి హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లి రెండు రోజుల పాటు వరుసగా సమావేశాలు జరిపినపుడు 'కవిత సమస్యను ఏమి చెయ్యాలి' అని చర్చలు జరిగాయన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

అయితే సాధారణంగా ఏ రాజకీయ పార్టీలో అయినా ఒక ముఖ్య నాయకుడు లేదా నాయకురాలు పార్టీ అధినేత వైఖరిని నేరుగా ప్రశ్నించినప్పుడు ఆ పార్టీ అధినేత లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా వారి తరపున దూత ఎవరయినా రంగంలో దిగి,సమస్య పెద్దదిగా మారకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.బిఆర్ఎస్ తో 'అవసరమయితే' తెగతెంపులు చేసుకునే దిశగా కవిత ప్రయాణం కనిపిస్తుంటే,కనీసం ఆమెతో కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావులలో ఎవరూ మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.పైగా ఆమె లేఖ రాసిన విషయం తెలిసి కూడా తమ పార్టీ అధికార పత్రికలో 'అది నకిలీ లేఖ' అని కథనాలు రాయించడం వెనుక కేసీఆర్ ప్రమేయం లేదని అనుకోవడానికి వీల్లేదు.కవిత అమెరికా పర్యటన ముగించుకొని రాగానే ఆ పత్రికా కథనానికి అనుగుణంగా మాట్లాడతారని కూడా కేసీఆర్ భావించి ఉండవచ్చు.

కానీ కేటీఆర్,కేసీఆర్ అంచనాలను తుంచి పారేస్తూ ''నేనే ఆ లేఖ రాశాను.చేతి రాత నాదే.లీక్ చేసిన వాళ్లెవరో తేలాలి'' అని శంషాబాద్ ఎయిర్ పోర్టులో కవిత గర్జించారు.ఈ పరిణామానికి కేసీఆర్,కేటీఆర్ బిత్తరపోయి ఉండవచ్చు.పోనీ,ఆ తర్వాత అయినా ఆమెతో పార్టీ అధినేత,తండ్రి కేసీఆర్ పిలిచి మాట్లాడాలి.ఎవరయినా తనను ప్రశ్నిస్తే,ధిక్కరిస్తే,నిర్మాణాత్మక సూచనలు సలహాలు ఇస్తే కేసీఆర్ స్వీకరించే రకం కాదు.ఆయన నైజం గురించి క్షుణ్ణంగా తెలిసిన వారెవరికయినా ఈ సంగతి తెలుసు.సొంత కూతురు అయినా ఇందుకు మినహాయింపు కాదని కవిత ఎపిసోడ్ తో అర్థమవుతోంది.కేసీఆర్ వ్యవహారశైలి గురించి ఎంత మాట్లాడినా తక్కువే.ఆధునిక రాజకీయ నాయకుడు అనుకునే కేటీఆర్ ఏమి చేస్తున్నట్టు?ఆయనకు ఏమి భేషజాలు ?పట్టింపులు ఏమిటి ?పంతాలు ఎందుకు ?

మరో పార్టీలో అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న వ్యక్తి హుటాహుటిన కవిత ఇంటికి వెళ్లి,పలకరించి,యోగక్షేమాలు తెలుసుకొని పార్టీ అధినేతకు లేఖ రాయవలసిన అవసరం,సందర్భం వంటి ఇతర అంశాలపై చర్చిస్తారు.'' భౌగోళిక తెలంగాణ సాధించుకున్నాం. కానీ పదేండ్లలో సామాజిక తెలంగాణను సాధించుకోలేకపోయాం'' అని కవిత ఏ ఉద్దేశంతో వ్యాఖ్యానించారో,తనపై పార్టీలోనే కుట్ర జరుగుతోందంటూ బహిరంగంగానే చేసిన వ్యాఖ్యల ఆంతర్యమేమిటో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎందుకు తెలుసుకోలేకపోయారు.''ఆమె పార్టీని విడిచిపెట్టే సమయం ఆసన్నమైంది'' అని ఆయన,కేసీఆర్ ఒక నిర్ధారణకు వచ్చారా? లేక ''బయటకు గెంటివేస్తే ఇక ఏ కిరికిరీ ఉండదు'' అని అనుకుంటున్నారా? అనే అంశాలపై స్పష్టత రావడం లేదు.ఆమె,తనకు తానే పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయేందుకు తండ్రీ,కొడుకు,మేనల్లుడూ సన్నాహాలు చేస్తున్నట్టుగా కొని అనుమానాలున్నవి.ఇందులో హరీశ్ రావు పాత్ర స్వల్పమే.''కేసీఆర్ నిర్ణయమే శిరోధార్యం. కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పజెప్పినా నాకు సమ్మతమే''అని హరీష్ వ్యాఖ్యలు చేయగానే కేటీఆర్ హరీష్ రావు ఇంటికి వెళ్లి కలవడంతో 'సంక్షోభానికి' బీజం పడింది.కేటీఆర్ కు పగ్గాలు అప్పజెప్పడం కవితకు ఇష్టం లేకపోవచ్చు.హరీష్ ఆ వ్యాఖ్యలు మనస్ఫూర్తిగా చేశారా లేదా సస్పెన్స్.

కాగా ఎమ్మెల్సీ కవిత బిఆర్ఎస్ లో నాయకత్వ ప్రతిభ ఉన్న మహిళ.'బతుకమ్మ' పండుగను తెలంగాణ అంతటా అంగరంగ వైభవంగా జరపడం వెనుక ఆమె పాత్రను తోసిపుచ్చడం కుదరదు.నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే 2012 లో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం 'బతుకమ్మ' పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించి నిధులు మంజూరు చేసింది.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే ఈ పండుగకు కేసీఆర్ పుణ్యమా అని పూర్వ వైభవం వచ్చినట్టు ఇంతకాలం జరుగుతూ వస్తున్న ప్రచారం బూటకమని తేలిపోయింది.బతుకమ్మ పండుగ ద్వారా,తెలంగాణ జాగృతి సంస్థ కార్యక్రమాల ద్వారా కవిత రాజకీయంగానూ 'వెలుగుతున్న' వేళ ఆమెను కుదించడానికి కేసీఆర్ ప్రయత్నించినట్టు కొన్ని విషయాలు వెలుగు చూస్తున్నాయి.

నిజామాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు ఆమె బతుకమ్మ పండుగలో పాల్గొనేందుకు కల్వకుర్తి వెడుతుండగా,కేసీఆర్ స్వయంగా ఫోన్ చేసి ''నీ పార్లమెంటు పరిధీ దాటి ఎందుకు వెడుతున్నావ్.రాష్ట్రమంతటా తిరగవలసిన అవసరం లేదు'' అని హెచ్చరించడమే నిజమయితే ఎలా అర్థం చేసుకోవాలి?కవితకు చెందిన నిజామాబాద్ జిల్లా అభిమానులు ఒకరిద్దరి ద్వారా ఈ విషయం తెలిసింది.ఇది 201415 లో జరిగిన ఘటన. కేసీఆర్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టి ఏడాది గడచిన సందర్భం. బతుకమ్మ పండుగ కావచ్చు,జాగృతి కార్యకలాపాలు కావచ్చు,కవితకు పాపులారిటీ పెరుగుతుండడం పట్ల ఆ సమయంలో ఎవరు అసూయ చెందారు ?ఎందుకు ఈర్ష్య పడ్డారు?ఆమె తనకు పోటీదారుగా మారుతారని భయపడ్డ మనిషి ఎవరు?కొన్ని రోజుల అనంతరం 'తెలంగాణ జాగృతి' ని మూసివేయాలని కేసీఆర్ ఎందుకు సూచించారు? కమిటీలన్నింటినీ రద్దు చేయాలని ఎందుకు కోరారు?ఆ తర్వాత రెండు మూడేండ్లకే మరలా 'తెలంగాణ జాగృతి'ని యాక్టివేట్ చేయాలని నాటి ముఖ్యమంత్రి ఎందుకు కోరారు?

కేటీఆర్ కు పోటీగా అవతరించే అవకాశమున్న హరీష్ రావు,కవితలను పార్టీ నుంచి బయటకు పంపించడానికి కేసీఆర్ స్కెచ్ వేశారని ఒక ప్రచారం సాగుతోంది.ఈ ప్రచారాన్ని బిజెపి ఎంపీ,పూర్వాశ్రమంలో బిఆర్ఎస్ నాయకుడు ఈటల రాజేందర్ ఒక న్యూస్ ఛానల్ లో ధృవీకరించారు.'' తనను ప్రశ్నించినా,ఎదురు తిరిగినా,ధిక్కరించినా కేసీఆర్ సహించే రకం కాదు. అటువంటి వ్యక్తులను తక్షణం గెంటివేసే పథకాలను రచించి అమలు చేస్తారు.తనకు అనుకూలంగా పరిస్థితి బాగా లేనప్పుడు ఎప్పుడయినా మరలా చేరదీసినా వారి అంతుచూసే దాకా ఆయన నిద్రపోడు.అంతగా పగ పడతాడు.దానికి నేనే ఒక ఉదాహరణ'' అని ఈటల అన్నారు.

కుటుంబ రాజకీయ పార్టీలలో గొడవలకు కారణాలు మూడు.ఆస్తులు,అంతస్తులు ధన దాహం,అధికారంలో వాటా.ఈ మూడింటి చుట్టూ ప్రపంచంలోని గొడవలన్నీ ముడిపడి ఉన్నాయి.కేసీఆర్ కుటుంబంలో ఆస్తులు,ఆధిపత్య గొడవల గురించి సర్వత్రా ఆసక్తికర చర్చ సాగుతోంది.అన్నా చెల్లెళ్ల మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం బజారుకెక్కింది.అయితే కవిత నేరుగా పార్టీ అధినేత,తన తండ్రి కేసీఆర్ తోనే తలపడుతున్నారు. ఆమె కేటీఆర్ ను రాజకీయ నాయకుడుగానే గురించేందుకు నిరాకరిస్తున్నట్టు తెలియవచ్చింది.తనపై పార్టీలో కుట్రలు జరుగుతున్నట్టు ఆరోపణలు చేసిన తర్వాత కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంటనే స్పందించకపోవడం,తనకు మద్దతుగా పార్టీ నిలబడకపోవడం పట్ల కవిత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.పార్టీలో తనకు అవమానాలు ఎడతెరిపి లేకుండా సాగుతుండడంతో ఆమె తిరుగుబాటుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది.సాధారణంగా ఆస్తి తగాదాలు కుటుంబాల్ని విడదీస్తాయి. అన్నదమ్ములు,అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు,తండ్రి కూతుళ్ల మధ్య వైరుధ్యాలను సృష్టించగలవు.కొన్నిసార్లు కుట్రలు కక్షలతో చంపుకునేవరకూ కూడా వెళుతుంటుంది.

కానీ బిఆర్ఎస్ లో ఆస్తి తగాదాలకు సంబంధించి బహిరంగంగా ఎలాంటి వివరాలు వెలుగు చూడలేదు.తాజ్ మహల్ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలను మరచిపోయినట్లే,ఉద్యమంలో తన కాంట్రిబ్యూషన్ ను కేసీఆర్ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నట్టు ఆమె ఆవేదన.ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పాలించిన కేసీఆర్ వరుసగా ముఖ్యమంత్రి అయ్యి పదవిలో ఉన్న కాలంలో లక్షల కోట్లు కూడబెట్టారన్న ఆరోపణలున్నవి.ఆస్తులు సహా అన్ని విషయాల్లోనూ తన కొడుకు కేటీఆర్ కోసం తన మేనల్లుడు హరీష్‌రావును కేసీఆర్ దూరం పెట్టారని అప్పట్లో ప్రచారం ఉన్నది. కేటీఆర్, కుమార్తె కవిత రాజకీయాల్లో స్టార్ హోదా సంపాదించుకున్నారు. నిరంతరం ప్రజల మధ్యలో ఉండి, సిద్ధిపేట నియోజక వర్గంలో తనకంటూ ఒక స్థాయిని తెచ్చుకున్న కారణంగానే హరీష్‌రావు నిలదొక్కుకోగలుగుతున్నారు.ఆయన సమర్థుడు అయి ఉండకపోతే కేసీఆర్ ఎపుడో తొక్కి పారవేశారన్న ప్రచారం లేకపోలేదు. కేసీఆర్ వరంగల్ సభలో తన కుమారుడు కేటీఆర్ తన తర్వాత ముఖ్యమంత్రి అవుతాడనే సంకేతాలు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలున్నవి.కేసీఆర్ వ్యాఖ్యలు కవిత,హరీష్‌రావుకు మింగుడుపడనివి.

తెలంగాణ జన జాగృతి అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ కవిత బహిరంగంగా కేసీఆర్ కు లేఖ రాయడం, అది లీకవ్వడం తెలంగాణ పొలిటికల్ కారిడార్ లో కలకలం రేపింది. కుటుంబంలో కుమారుడికి మాత్రమే కేసీఆర్ ప్రాధాన్యతనివ్వడం, లిక్కర్ స్కామ్ లో ఇరుక్కున్న కూతురిని పక్కన పెట్టడం ఇప్పుడు పెద్ద రచ్చగా మారుతోంది.కేసీఆర్ చుట్టూ దెయ్యాలు చేరాయని కవిత విమర్శించడం వలన కల్వకుంట్ల కుటుంబంలో వివాదాలు ఏ స్థాయికి ముదిరాయో అర్థం చేసుకోవచ్చు.అధికారం అంతా తన అన్నకే తండ్రి కట్టబెడితే పార్టీలో తన స్థానం ఏమిటి? అనేది కవితకు కంటిమీద కునుకుపట్టనివ్వడం లేదు.అంతకంతకు పార్టీలో తనకు ప్రాధాన్యం తగ్గిపోతున్నందున ఆమె 'తిరుగుబాటు' దారిని ఎంచుకున్నారు.
కవిత బీఆర్ఎస్ పార్టీని వదిలేసి సొంతంగా పార్టీని ప్రారంభిస్తారని కూడా కథనాలొస్తున్నాయి కానీ దీనిపై ఆమె అధికారికంగా ప్రకటించవలసి ఉన్నది. కవిత సామాజిక తెలంగాణ నినాదంతో పార్టీని ప్రారంభించనున్నట్టు కొన్ని కథనాలు వైరల్ అవుతున్నాయి. కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు ఎవరో కానీ, కవితలో అగ్నిపర్వతం బద్దలయ్యింది.కల్వకుంట్ల కుటుంబంలో పెద్ద చీలికను తెచ్చిందని విశ్లేషిస్తున్నారు. ఇదంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కవిత వెనక ఉండి ఆడిస్తున్న నాటకమని మరో వాదనను తెరపైకి బలంగా తీసుకు రావడానికి కేటీఆర్ మద్దతుదారులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.కవిత తన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని ఉన్నారు.జూన్ ఒకటిన ఆమె పార్టీ జెండా,ఎజెండా ప్రకటించనున్నట్టు ప్రచారం ఊపందుకుంటుంది.కానీ కవిత సన్నిహితుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఆమె ఇప్పుడే సొంత పార్టీ పెట్టె అవకాశాలు లేవు.ఎస్.సి,ఎస్.టి,బిసి,మైనారిటీ నాయకులు,సామాజికతెలంగాణ నినాదాన్ని సమర్థిస్తున్న బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఎమ్మెల్యేలు,ఇతర నాయకులు,కార్యకర్తలు,సామాజిక కార్యకర్తలు,పౌరహక్కుల కార్యకర్తలు,ప్రజా సంఘాల నాయకులతో కవిత సంప్రదింపులు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.అందరి నుంచీ ఆమె ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని,పార్టీ పెట్టేందుకు గాను సానుకూలమైన వాతావరణం ఉన్నట్టు నిర్ధారించుకున్న తర్వాతే ఆమె ముందడుగు వేస్తారు.

> “ **అన్నా చెల్లెళ్ల మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం బజారుకెక్కింది.అయితే కవిత నేరుగా పార్టీ అధినేత,తన తండ్రి కేసీఆర్ తోనే తలపడుతున్నారు.ఆమె కేటీఆర్ ను రాజకీయ నాయకుడుగానే గురించేందుకు నిరాకరిస్తున్నట్టు తెలియవచ్చింది.తనపై పార్టీలో కుట్రలు జరుగుతున్నట్టు ఆరోపణలు చేసిన తర్వాత కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంటనే స్పందించకపోవడం,తనకు మద్దతుగా పార్టీ నిలబడకపోవడం పట్ల కవిత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.**

> “ **కవిత సన్నిహితుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఆమె ఇప్పుడే సొంత పార్టీ పెట్టే అవకాశాలు లేవు. ఎస్.సి,ఎస్.టి,బిసి,మైనారిటీ నాయకులు,సామాజికతెలంగాణ నినాదాన్ని సమర్థిస్తున్న బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఎమ్మెల్యేలు,ఇతర నాయకులు,కార్యకర్తలు,సామాజిక కార్యకర్తలు,పౌరహక్కుల కార్యకర్తలు,ప్రజా సంఘాల నాయకులతో కవిత సంప్రదింపులు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.అందరి నుంచీ ఆమె ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని,పార్టీ పెట్టేందుకు గాను సానుకూలమైన వాతావరణం ఉన్నట్టు నిర్ధారించుకున్న తర్వాతే ముందడుగు వేస్తారు.**

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# భారత్ ను ద్వేషించడమే పాక్ ఏకైక లక్ష్యం

**మనకు హాని కలిగించే మార్గాన్వేషణలో**

**నిరంతర ప్రయత్నం**

- భారత్ లక్ష్యం పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి
- గుజరాత్ పర్యటనలో పాకిస్తాన్ పై ప్రధాని మోదీ ఫైర్



**మహా :** పాకిస్థాన్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశం ఏకైక లక్ష్యం భారత్‌ను ద్వేషించడం, మనకు హానికలిగించే మార్గాల గురించి ఆలోచించడమేనని మండిపడ్డారు. కానీ, భారత్ మాత్రం దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంతో ముందుకెళ్తోందన్నారు. సోమవారం గుజరాత్‌లోని దాహోద్‌లో రూ. 24వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ ఇటీవల భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించిన ప్రధాని మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచిపెట్టే దుస్సాహసానికి ఒడిగట్టిన వారి ముగింపు దగ్గరపడినట్లేనని తెలిసేలా చేశామన్నారు. దేశ విభజన తర్వాత ఏర్పాటైన పాకిస్థాన్ భారత్ పట్ల ద్వేషంతో బతుకుతోందని, మనకు హాని చేయాలనుకుంటోందని మండిపడ్డారు. కానీ, భారత్ మాత్రం పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి సాధించడం, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడమే లక్ష్యంగా నిర్దేశించుకొని ముందుకెళ్తోందని చెప్పారు.

2014లో ఇదేరోజు తొలిసారి పీఎంగా బాధ్యతలు చేపట్టానని నరేంద్రమోదీ గుర్తుచేసుకున్నారు. తొలుత గుజరాత్ ప్రజలు తనను ఆశీర్వదించారని, తర్వాత కోట్లాది మంది భారతీయులు ఆశీస్సులు అందించారని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో దాహోద్‌లో వేల కోట్లు రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. వెరావల్‌అహ్మదాబాద్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్, వల్సాద్‌దాహోద్‌ల మధ్య ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. ఎలక్ట్రిక్ లోకోమోటివ్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ''దేశాన్ని వికసిత్ భారత్ దిశగా మార్చేందుకు 140 కోట్ల మంది ప్రజలు ఐక్యంగా పనిచేస్తున్నారు. ఈ 11 ఏళ్లలో ఎన్నో నిర్ణయాలు తీసుకున్నాం. దశాబ్దాల నాటి సంకెళ్లను బద్దలు కొట్టి, దేశాన్ని తయారీ కేంద్రంగా మార్చుతున్నాం. కార్లు, ఫోన్లు, బొమ్మలు, ఆయుధాలు ఎగుమతి చేస్తున్నామన్నారు. మూడు సంవత్సరాల క్రితం ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశాను. దీనిపై ఎన్నో విమర్శలు వినిపించాయి. ఎన్నికల సమయం కాబట్టి ప్లాంట్‌కు పునాది వేశారు కానీ ఏ నిర్మాణాలు చేపట్టరని విమర్శించారు. కానీ ఈ రోజు ఇక్కడ ఎలక్ట్రిక్ లోకోమోటివ్ తయారైంది. అది మనకు కనిపిస్తోంది'' అని మోదీ అన్నారు. అనంతరం రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ''2022లో ఆధునిక ఎలక్ట్రిక్ ఇంజిన్లను తయారు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 2023లో ఆ దిశగా పని మొదలైంది. ఇప్పుడు ఆ ఫ్యాక్టరీ సిద్ధమైంది'' అని వెల్లడించారు. వేదికవద్దకు చేరుకోవడానికి ముందు మోదీ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేశారు. ఆ ర్యాలీలో కర్నల్ సోఫియా ఖురేషీ కుటుంబం పాల్గొంది. వారు మోదీపై పూలు చల్లి ఘనస్వాగతం పలికారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను మీడియాకు వివరించడంతో సోఫియా పేరు వార్తల్లో నిలిచింది.

# ప్రైవేట్ హాస్పిటల్లపై నిఘా

**ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవు**

- వర్షా లు ప్రారంభం.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం
- రాష్ట్రంలో కొవిడ్‌తో ఇప్పటికైతే ప్రమాదమేమీ లేదు
- అధికారులకు హెల్త్ మినిస్టర్ దామోదర ఆదేశాలు
- కొవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై అధికారులతో సమీక్ష



**మహా:** సీజనల్ వ్యాధుల నివారణకు ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం మంత్రి కొవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై సెక్రటేరియట్‌లో నిపుణులు, ఉన్నత స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం, పరిశోధనల ప్రకారం కొవిడ్‌తో ఇప్పటికైతే ప్రమాదమేమీ లేదన్నారు. వివిధ దేశాల్లో అక్కడక్కడా కేసులు పెరుగుతున్నా హాస్పిటలైజేషన్ కేసులు లేవన్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్న పేషెంట్లు జాగ్రత్తగా ఉంటే సరిపోతుందన్నారు. సాధారణ ప్రజలు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమైతే ఇప్పుడు కనిపించడం లేదన్నారు. కొవిడ్‌పై ఎక్స్‌పర్ట్స్ ఎప్పటికప్పుడు నిరంతరం పరిశోధనలు చేస్తున్నారని, సైలెంట్‌గా కేసులు పెరిగినా, క్రమంగా తగ్గుదల కూడా ఉన్నదన్నారు. కొందరిలో కొవిడ్ వచ్చి పోయిన విషయం కూడా తెలియడం లేదన్నారు. మన రాష్ట్రంలో, దేశంలో ప్రజల్లో ఇప్పటికే హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చినందున పెద్దగా, కంగారు పడాల్సిన అవసరం లేదని నిపుణులు చెప్పినట్లు తెలిపారు.

**సరిపడా అందుబాటులో ఉంచుకోవాలి..**

రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయని, సీజనల్ వ్యాధులతో హాస్పిటల్లో ఓపీ, ఐపీ పెరిగే అవకాశం ఉన్నందున అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషెంట్లకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదన్నారు. అవసరమైన మందులు, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్, మెడికల్ రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. శానిటేషన్, డైట్ నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు హాస్పిటళ్లపై నిఘా పెంచాలని, డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు మొదలైనందున వానాకాలం పంటలను రైతులు ప్రారంభిస్తారని, ఈ క్రమంలో పాము, తేలు కాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని మంత్రి గుర్తుచేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి టీచింగ్ హాస్పిటల్ వరకూ అన్ని హాస్పిటళ్లలో పాము, తేలు కాటు పేషెంట్లకు ట్రీట్‌మెంట్ అందించేందుకు అవసరమైన మెడిసిన్, ఇంజెక్షన్లు అందుబాటులోకి ఉంచుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన

# దివ్యాంగ నాయకులు

**ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుంది**

**ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వరంగల్ మహా;** నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా దివ్యంగా నాయకులు సోమవారం హనుమకొండలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ కడియం కావ్య ను, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ను వారి క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ మాట్లాడుతూ 1.దివ్యాంగుల ఓటు బ్యాంకును గుర్తించి దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, అదేవిధంగా 2.దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టులలో చైర్మన్, డైరెక్టర్ లలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో దివ్యాంగులకు ట్రైన్ రాయితీ పసులో అనేక ఇబ్బందులు ఉన్నాయని వీటిని పరిష్కరించాలని, 3) ఇందిరమ్మ ఇండ్లలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ ను కచ్చితంగా అమలు చేయాలని మనవి. 4) దివ్యాంగులకు ఇచ్చే ఆసరా పెన్షన్ ను వెంటనే 6000 రూపాయలకు పెంచాలని, 5) దివ్యాంగులకు సంబంధించిన అన్ని ఆఫీసు లను వెంటనే వేరు చేయాలని ముఖ్యంగా 6) జిల్లాలోని దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వినతి పత్రంలో కోరడం జరిగింది. ఇందుకు ఎంపీ కడియం కావ్య స్పందించి ట్రైన్ పాసుల విషయం గూర్చి వెంటనే సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దివ్యాంగుల సమస్యలపై చురుగ్గా పనిచేస్తున్న దివ్యాంగులకు తప్పకుండా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు వారికి దివ్యాంగుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారులు చెదలవాడ లక్ష్మీనారాయణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గై సతీష్, ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, మండల అధ్యక్షులు మందపురి అశోక్, ఆకులపల్లి రమేష్, దేవర రాజు, అమరరాజు స్వామి, బర్ల జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లులో ధాన్యం కొనుగోలు చేయాలి

**మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు బైఠాయించిన తల్లోజు ఆచారి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆమనగల్లులో ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు బైఠాయించిన తల్లోజు ఆచారి. ఆమనగల్లు, జంగారెడ్డి పల్లి, మేడిగడ్డ, చింతలపల్లి, సంకటోనిపల్లి, ముర్తోజపల్లి, సాకిబండతాండ, విటాయిపల్లి రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ అమంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ముందు బైఠాయించిన, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని అధికారులను హెచ్చరించారు. అనంతరం మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి మాట్లాడుతూ... తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించడం జరిగింది. రైతులపై రాజకీయ కక్షతో ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా, ఇతర మండలంలో ఉన్న రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం రైతుల పైన కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో, కళ్ళలో వద్ద ధాన్యం మొలకెత్తడం జరిగింది. కనుక రైతులకు న్యాయం చేయని యెడల భారీ ఎత్తున రైతుల పక్షాన ఏ ఉద్యమానికైనా సిద్ధంగా ఉండి, రైతుల పక్షాన్ని పోరాడుతామని అన్నారు. ప్రభుత్వ అధికారుల మొండి వైఖరి విడనాడి రైతుల పక్షాన్న ఉండాలని అధికారులను కోరనైనది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఆమనగల్ మాజీ జెడ్పిటిసి కండే హరి ప్రసాద్, మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్ రాంపాల్ నాయక్, దుర్గయ్య ఆమనగల్ మున్సిపాలిటీ బిజెపి పార్టీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కల లక్ష్మణ్, కల్వకుర్తి అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నరసింహ,ఆమనగల్ మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, మేడిశెట్టి శ్రీధర్, భాషా భాయ్, శ్రీకాంత్ సింగ్, ఝాన్సీ శేఖర్, ఆమనగల్ మండలం బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనివాస్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం రవి రాథోడ్, కల్వకుర్తి అసెంబ్లీ బిజెపి పార్టీ సోషల్ మీడియా పద్మ ప్రశాంత్, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలి

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం అభినందనీయం ఎమ్మెల్యే కసిరెడ్డి. నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ సమీపంలో పేద ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఉచిత విద్యను అందించే జామియా ఇస్లామియా దారుల్ ఉలూమ్ కైసర్ ఉర్దూ పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో ఖరీదు అవుతున్న విద్యను విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన పాఠశాల ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ కరీం షా ఖాద్రి ని ఆయన అభినందిస్తూ స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాయకులు నరసింహ, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఆర్కపల్లి రేషన్ డీలర్ పై ఫిర్యాదు

**ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జర్పుల విజయ్ కుమార్ నాయక్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆర్కపల్లి రేషన్ డీలర్ పై ఫిర్యాదు చేసిన జర్పులతండా గ్రామ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు. రంగారెడ్డి జిల్లా, మాడుగుల మండలం, జర్పుల తండా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన అర్హులకు ప్రొసీడింగ్స్ అందజేసి, సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, రాజకీయాల గురించి ప్రచారం చేయడాన్ని ప్రశ్నిస్తూ, అర్కపల్లి రేషన్ డీలర్ జర్పుల లక్య నాయక్ పై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జర్పుల విజయ్ కుమార్ నాయక్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఆర్కపల్లి రేషన్ డీలర్ పై చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లు విజయకుమార్ తెలిపారు.

## నగరంలో పుట్టగొడుగుల్లా

# పుట్టుకొస్తున్న కిడ్స్ ప్లే స్కూల్స్

**ప్రభుత్వ అనుమతులు లేని కిడ్స్ ప్లే స్కూల్స్ ను మూసివేయాలి**

**జిల్లా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేత**

**స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు**




**హన్మకొండ మహా;** హన్మకొండ నగరంలో పుట్టగొడుగుల్లా కిడ్స్ ప్లే స్కూల్స్ పుట్టుకొస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ నగరం లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వీధికి ఒక కిడ్స్ ప్లే స్కూల్స్ ను నడిపిస్తున్న పట్టించుకోని హనుమకొండ జిల్లా ఎంఈఓ, డీఈఓ అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్లే కిడ్స్ స్కూల్స్ నడిపిస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అదేవిధంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ ప్రీ ప్రైమరీ, ఎల్కేజీ, యూకేజీ లకే స్కూల్ యాజమాన్యాలు లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేకుండా నడిపిస్తూ వారికి ఉండవలసిన ప్రాంతంలో ఉండకుండా నిబంధనలకు విరుద్ధంగా మొదటి, రెండవ అంతస్తులలో తరగతులు నిర్వహిస్తూ వారికి ఎటువంటి ఫైర్ సేఫ్టీ లేకుండానే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు నడిపిస్తున్నారు. ప్రమాదవశాత్తు విద్యార్థులకు జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. స్థానిక హనుమకొండ జిల్లా ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ కిడ్స్ ప్లే స్కూల్స్ ను తక్షణమే మూసివేయాలని ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ చిన్నారి పిల్లల తో పాటు వీరి తల్లిదండ్రులకు తగిన న్యాయం చేయాలని హనుమకొండ జిల్లా ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రంలో కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ నాయకులు చెట్టుపల్లి శివకుమార్, సిద్దు, తదితరులు, పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**వాహన తనిఖీల్లో పట్టుబడ్డ నిందితుడు.. వివరాలు వెల్లడించిన ఏసిపి నరసింహారావు**



**హన్మకొండ మహా;** హనుమకొండ నగరంలోని ఆదాలత్ సెంటర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసి, కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో నిందితుడైన మంద కళ్యాణ్ ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేయడం జరిగిందని హనుమకొండ ఏసిపి నరసింహారావు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు.

**వివరాల్లోకి వెళ్తే..**

నిందితుడు మంద కళ్యాణ్ శ్రీనివాస్, వయసు 26 సంవత్సరాలు, కులం, మాదిగ, వృత్తి: కార్ డ్రైవర్, గతంలో నిందితుని తండ్రి వరంగల్ మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ జవాన్ గా పని చేసి హార్ట్ అటాక్ తో చనిపోగా, ఆ పబ్లిక్ హెల్త్ జవాన్ ఉద్యోగం నిందితుడికి రావడంతో 2019 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలోనే పని చేసాడు. కాగా ఉద్యోగ రీత్యా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో 2024 ఫిబ్రవరిలో ఆ ఉద్యోగం మానేసి జులాయిగా తిరగడం వల్ల ఎటువంటి ఆదాయం లేకపోవడంతో అడ్డదారిలో డబ్బు సంపాదించాలని అనుకున్నాడు. ఈ క్రమంలోనే ఎవరైతే ఉద్యోగం లేక ఉద్యోగం కోసం అన్వేషణలో ఉన్నారో అలాంటి వారిని ఎంచుకొని, వారితో నాకు పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలు ఉన్నాయని మీకు ఆయా శాఖల్లోనే కాక వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని వారిని మోసం చేయాలని అనుకున్నాడు. ఈ నేపథ్యంలోనే దాదాపుగా 40 మంది దగ్గర 16,14,000/ రూపాయలు వసూలు చేసి కూరపాటి భవ్య కిరణ్, మంద వంశీ సహకారంతో వారికి ఉద్యోగాలు ఇస్తున్నట్లుగా నకిలీ నియామక పత్రాలు తయారు చేయడమే కాకుండా వారిని నమ్మించడానికి సర్వీస్ బుక్ లను కూడా ఏర్పాటు చేసి వారిని బురిడీ కొట్టించాడు. అంతేకాకుండా నిందితుడు ఆ నకిలీ నియామక పత్రాలు, సర్వీస్ బుక్ ల పై ఏకంగా వరంగల్ కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేసి వారికి ఇచ్చాడని, మిగతా నిందితులు కూరపాటి భవ్య కిరణ్, మంద వంశీ గా హనుమకొండ ఏసిపి వెల్లడించారు. నిందితుని వద్ద 39 సర్వీస్ బుక్స్ , 23 నకిలీ నియామక పత్రాలు, ఒక i10 కారు, 1ద్విచక్ర వాహనం, ఎల్ఈడి కలర్ టీవీ,సాంసంగ్ స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఏసిపి నరసింహారావు తెలిపారు. ఈ సమావేశంలో సుబేదారి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐలు, పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్



**వరంగల్ మహా;** వచ్చే ఎన్నికల నాటికి ప్రతి కాలనీలో చుక్క నీరు నిల్వకుండా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో సుమారు 50 లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు నిర్మాణం కోసం నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు కు నక్కలపల్లి గ్రామ ప్రజలు డప్పుసప్పుల్ల, మహిళల కోలాటంల నడుమ ఎమ్మెల్యే నాగరాజు కు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. మొదటిసారిగా నక్కలపల్లి గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మన్నె బాబు రావు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వారి ఇంటికి మంగళహారలతో ఆహ్వానం పలికారు. అనంతరం మన్నే బాబు రావు తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.


**అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ...**

స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా సమవుజ్జిగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో నిర్ణీత సమయంలో రోడ్లు,డ్రైన్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.స్థానిక ప్రజలు ఎమ్మెల్యే నాగరాజు కు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి అనేది నిరంతరం ప్రజలందరూ ప్రభుత్వానికి అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే డివిజన్ లోని పలుసమస్యల నా దృష్టిలో ఉన్నాయి ఒక్కొక్కటి అన్ని చూసాను తీరుస్తాను అన్నారు. ప్రధాన సమస్యలు అన్నిటిని ఒక్కొక్కటిగా తీరుస్తానన్నారు. సిడిఎఫ్ & మున్సిపల్ నిధులతో డివిజన్ లోని అన్ని విలీన గ్రామాలను అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే మీకు ఏ సమస్య ఉన్న డయల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ 8096107107 కు ఫోన్ చేసి మీ సమస్య వివరిస్తే త్వరితన పనులు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా వరంగల్ పాక్స్ చైర్మన్ కేడల జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు మన్నె బాబురావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బన్న శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు వద్దేపల్లి ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు చింత ప్రకాష్, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెవ్వ శివరామకృష్ణ, గ్రామస్తులు, డివిజన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ లో పార్కు స్థలాలకు రక్షణ లేదా?

**3 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు యత్నం.. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో పార్కు స్థలాలకు రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారిన పాలకుల్లో మార్పు రావడం లేదని నగర ప్రజలు మండి పడుతున్నారు. నగరంలో ఆయా డివిజన్ల పరిధిలో గతంలో కుడా లేఔట్ ల ద్వారా కాలనీలు ఏర్పడ్డాక జిడబ్ల్యుఎంసీ ద్వారా అట్టి ప్రాంతాలలో కొంత స్థలాన్ని పార్కు స్థలాలకు కేటాయించడం జరిగింది. ఆ ప్రాంతం అభివృద్ధి చెంది స్థలాలకు కోట్లలో విలువ పెరిగింది. ఈ స్థలాల పై స్థానిక పెద్దల కన్ను పడింది. ఈ స్థానిక పెద్దలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వంలో చేరుతూ ఆ ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుని వారి అండదండలతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను, స్థలాలను చివరికి పార్కులను కూడా వదలడం లేదు. గతంలో వరంగల్ లో ఉన్న 13 డివిజన్ పరిధిలో ఉన్న పార్కు స్థలం, ఇటీవల 22వ డివిజన్ పరిధిలోని పార్కు స్థలం, హనుమకొండ లోని ప్రభుత్వ స్థలాలను అలాగే పార్కు స్థలాలను సైతం కబ్జాదారులు వదలడం లేదు. వీరికి సంబంధిత అధికారుల సహకారం ఉంటుందని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలో 3 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు కొంతమంది కబ్జాదారులు యత్నిస్తున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ పార్కు స్థలం కాపాడుకునేందుకు గత 14సంవత్సరాలుగా ఈ పార్కు స్థలం కోసం పోరాటం చేస్తున్నామని కాలనీ వాసులు అంటున్నారు. అంతేకాకుండా డివిజన్ పరిధిలోని కాలనీలలో ఖాళీ స్థలాన్ని చూస్తే కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కాలనీలో ఉన్న బలహీన వర్గాల కోసం పార్కు స్థలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కాలనీవాసులు వేడుకుంటున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాకు ఎటువంటి న్యాయం జరగలేదని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మా కాలనీవాసులకు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుకుంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా వ్యవహరిస్తూ, ప్రభుత్వ స్థలాలను పార్కు స్థలాలను కబ్జా చేసిన, చేస్తున్న వారి పై అలాగే వీరికి సహకరిస్తున్న అధికారుల పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## ముంపు నివారణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** రానున్న వర్షాకాలంలో ముంపు నివారణకు సంబంధిత శాఖల అధికారులు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో రానున్న వర్షాకాలంలో వరదల ముంపు నివారణకు తీసుకోవలసిన చర్యల పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి లతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాల సమయంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఆ ప్రదేశాలలో ప్రజలను ఉంచేందుకు తాత్కాలిక షెడ్లు, త్రాగునీరు, టాయిలెట్లు, వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. వర్షాల కారణంగా కూలిపోయే శిధిలావస్థలో ఉన్న భవనాలు, బ్రిడ్జి లు, కల్వర్టులు, కాజ్ వే లను గుర్తించి, ముందుగానే మరమ్మత్తులు చేయించాలన్నారు. వర్షకాల సమయంలో వాటి కారణంగా ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా




ముందుగానే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నదులు, కాల్వలు, చెరువులు గట్లను పరిశీలించి బలహీనం ఉన్న చోట్ల పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వరదల సమయంలో గండ్లు పడిన ప్రదేశాలను పరిశీలించి, అవసరమైన చోట పటిష్టం చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని, రోడ్లు తెగిపోయే ప్రాంతాలను ఆ శాఖ అధికారులు ముందస్తుగానే గుర్తించాలని గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలో వర్షపు నీరు కారణంగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారే ప్రాంతాలను గుర్తించాలన్నారు. చెరువులు, వాగుల స్థితిని ఎప్పటికప్పుడు శాఖ అధికారులు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలన్నారు. వాగులు పారే ప్రాంతాలను అధికారులు గుర్తించాలని, వాటిని సంబంధిత మండలాల తహసీల్దారులు పర్యవేక్షించాలన్నారు.

## సంక్షేమ పథకాలతో ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేరువ అవుతుంది

### పేదల ఇంటి నిర్మాణానికి 5 లక్షలు రూపాయల ఉచితంగా ప్రభుత్వం ఇస్తుంది: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా:** రాష్ట్రంలో పేద ప్రజలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుంది. నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్లో ఇందిరమ్మ గృహాలు మంజూరు అయిన 238 మంది లబ్ధిదారులకు సోమవారం మంజూరు పత్రాలను మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కష్టసుఖాలు తెలిసు కాబట్టి కావలసిన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల ఇంటి నిర్మాణానికి రూ 500000 లక్షల రూపాయలు ఉచితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తుందన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటి ముఖ్యమంత్రిగా చరిత్రలోకి ఎక్కారు. మున్సిపాలిటీ పరిధిలో అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. అధికారులకు సహకరించిన పార్టీ నాయకులు అన్ని వార్డులను అభివృద్ధి చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని నాయకులకు తెలిపారు. పని చేస్తున్న అధికారులను తప్పు పట్టడం మంచి పద్ధతి కాదు, ఇందిరమ్మ గృహాలు రానివారు ఎవరైనా ఉంటే రాబోయే రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి చేసుకున్న వారందరికీ మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్సింగ్ మున్సిపాలిటీ అధ్యక్షులు అశోక్ యాదవ్,తోపాటు మాజీ కౌన్సిలర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ లో ఉన్న వాటర్ బకాయిలు మాఫీ చేయించండి

### ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు

**రాజేంద్రనగర్, మహా** : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రషీద్ గూడా, పోశెట్టి గూడా గ్రామస్తులు ఐదు సంవత్సరాల పెండింగ్ లో ఉన్న నల్ల బిల్లులను తాము చెల్లించలేము, 2024 ,నుంచి 25 వరకు సంవత్సరం పాటు బిల్లు కట్టగలుగుతామని గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ బొమ్మ దవణాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి వినతి పత్రం అందజేశారు. గ్రామ వాస్తవ్యులు గత ఐదు సంవత్సరాల నుంచి హెచ్ఎం డబ్ల్యూ ఎస్ వాటర్ సప్లై గ్రామంలో జరుగుతున్నది. గ్రామంలోని ప్రతి ఇంటికి క్యాన్ నెంబర్ బిగించారు. ఐదు సంవత్సరాలకు గాను 15వేల నుంచి 20వేల రూపాయల వరకు ప్రతి ఇంటికి నల్ల బిల్లులు వచ్చాయి. 15, 20 వేల రూపాయలు నల్ల బిల్లులు గ్రామస్తులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు సంవత్సరాలకు నల్ల బిల్లులు



కట్టే పరిస్థితిలో గ్రామస్తులు లేరు. 2024 నుంచి 2025 వరకు సంవత్సరం పాటు నల్ల బిల్లులు కట్టగలరు. దయచేసి మాపై దయతలిచి నల్లా బిల్లులు మాఫీ చేయగలరని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి వినతి పత్రం అందజేశారు.

## లొంగిపోయిన ద్రోహులే..

### వారిచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్

నంబాల కేశవరావు సజీవంగా పట్టుకుని చంపారు

కేశవరావు టీమ్‌లో ఆరుగురు లొంగిపోవడంతో సమాచారం లీక్

కాల్పుల విరమణ ప్రకటించాక మేం కాల్పులు జరపలేదు

చర్చలకు విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదు

నంబాల ఎన్‌కౌంటర్ పై మావోయిస్టుల సంచలన లేఖ

**మహా:** మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు తొలిసారి స్పందించింది. ఈ మేరకు సోమవారం సంచలన లేఖ విడుదల చేశారు. మావోయిస్టు జోనల్ కమిటీ పేరుతో లేఖ విడుదలైంది. ఆ లేఖలో నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన కారణాల్ని అందులో పేర్కొన్నారు. 'లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారంతో ఎన్ కౌంటర్ జరిగింది. 6 నెలలుగా కేశవరావు మాడ్ ప్రాంతంలో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలుసు. కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరుగురు ఇటీవలే లొంగిపోయారు. వాళ్లు ఇచ్చిన సమాచారంతో ఎన్‌కౌంటర్. యూనిఫైడ్ కమాండో సభ్యుడు దేశ ద్రోహిగా మారాడు. రికీతో సహా పలువురు ద్రోహం చేయడంతో ఈ ఎన్ కౌంటర్. ఎన్‌కౌంటర్ ముందు రోజు నుంచి 20వేల మంది బలగాలు మా ప్రాంతాన్ని చుట్టి ముట్టాయి. 10 గంటల్లో ఐదు ఎన్ కౌంటర్లు జరిపాయి. 60 గంటల పాటు బలగాలు మమ్మల్ని నిర్బంధించాయి. కేశవరావుని కాపాడుకునేందుకు 35మంది ప్రాణాల్ని అడ్డుపెట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సురక్షింతంగా బయటపడ్డారు. నంబాలను సజీవంగా పట్టుకుని ఎన్ కౌంటర్ చేశారు.

**విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు..**

మమ్మల్ని వదిలి కేశవరావును సురక్షిత ప్రాంతాన్ని తరలించేందుకు ప్రయత్నించాం. కానీ మమ్మల్ని



వదిలి కేశవరావు బయటకు వెళ్లేందుకు ఒప్పుకోలేదు. నాయకత్వాన్ని ముందుండి మాతోటే నడిచారు. ప్రాణాల్ని ఫణంగా పెట్టారు. మా నాయకుడిని కాపాడు కోవడంలో మేం విఫలమయ్యాం. ఈ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే, మరో మృతదేహాన్ని మేం తీసుకెళ్లాం. దాయాది పాకిస్తాన్ కోరితే కాల్పుల విరమణకు అంగీకరించిన కేంద్రం.. తాము చర్చలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆ లేఖలో అసహనం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ జరిపిన కేంద్ర ప్రభుత్వం, తమతో శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేదని మావోయిస్టు స్పెషల్ కమిటీ ఆరోపించింది.

## వ్యవసాయంలో మెలకువలు తెలిపిన శాస్త్రవేత్తలు

### రైతులకు పంటలపై సూచనలు చేసిన అధికారులు

### పంట మార్పిడితో రైతులకు లాభాలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నాగర్ పల్లి తుర్కగూడ గ్రామాలలో నిర్వహించడం జరిగింది. గ్రామములో రైతు ముంగిట్లో శాస్తవేత్తల కార్యక్రమము మండల వ్యవసాయ అధికారిని విద్యాధరి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం, నాగన్ పల్లి, తుర్కగూడ గ్రామాలలో నిర్వహించడం జరిగింది. జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, హైదరాబాద్ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు డా టి రాం ప్రకాష్, డా బి పద్మజ పాల్గొని ప్రసంగించారు. యూరియా వాడకం మరియు ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అవసరం మేరకు వాడాలని సూచించారు. పంట మార్పిడి పాటించడం వలన నేల నీరు, వాతావరణం సమతౌల్యం పాటించాలని, మండల వ్యవసాయ అధికారిని విద్యాధరి అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారిని సృజన మాట్లాడుతూ... చెట్లను విరివిగా పెంచాలని అన్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... పశువులు మరియు గొర్రెల పెంపకంలో పాటించాల్సిన మెళకువలను రైతులకు సూచించారు. పశుగ్రాసాలను పెంచాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, పంట నమోదు చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. గ్రామాల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయం, పంటల యాజమాన్యం పై వారి యొక్క సమస్యలకు పరిష్కారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏఈఓ సృజన, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌కు ప్రమోషన్

### వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసే ఛాన్స్?

**మహా:** టీడీపీ కీలకనేత, మంత్రి నారా లోకేష్ కు పార్టీలో కీలక బాధ్యతల పైన డిమాండ్ వినిపిస్తోంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి (వర్కింగ్ ప్రెసిడెంట్)గా ఆయనకు బాధ్యతలు అప్పగించాలని టీడీపీ శ్రేణుల నుంచి అధిష్ఠానంపై పెద్దఎత్తున ఒత్తిడి వస్తోంది. పార్టీ అధినేతగా సీఎం బాధ్యతల్లో చంద్రబాబు బిజీగా ఉండటంతో పార్టీ నిర్వహణ ఇక లోకేష్‌కు అప్పగించాలనే చర్చ వినిపిస్తోంది. 2014 19 కాలంలో పార్టీని విస్మరించిన కారణంగానే 2019 ఎన్నికల్లో ఓటమి ఎదుర్కోవాల్సి వచ్చిందని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. పూర్తిగా ప్రభుత్వం పైనే దృష్టి పెడితే పార్టీ దెబ్బతింటుందని, పార్టీ కార్యకలాపాలకు కూడా నిర్ణీత సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. 2024లో మళ్లీ అధికారం



లోకి వచ్చిన తర్వాత పార్టీకి కచ్చితంగా సమయం కేటాయిస్తామని ఆయన చెబుతూ వచ్చారు. కానీ ఇప్పుడు అది కూడా సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో లోకేష్‌కు పార్టీ బాధ్యతలు ఇవ్వాలని క్యాడర్ కోరుతున్నారు.

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

**హన్మకొండ మహా;** ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తో కలసీ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆస్పత్రి ప్రాంగణంలోని సమావేశపు హాలులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని అన్నారు. దేశంలోనే అత్యదిక నిధులతో మెరుగైన వైద్య సేవలు, ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను నిర్దేశిత గడువు నాటికి పూర్తి చేయాలన్నారు. ఉత్తర తెలంగాణకు తలమానికంగా జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందు



కు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. వరంగల్ లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐకానిక్ హాస్పిటల్ అని పేర్కొన్నారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఇప్పటివరకు పూర్తయిన పనుల గురించి అధికారులు సీఎస్ కు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మ్యాప్ లను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులను అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరించారు.

## గిరిపుత్రుల ఆర్థికాభివృద్ధికి ఇందిరా సౌర గిరి జల వికాసం

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా:** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఇందిర సౌర గిరి జల వికాసం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐటిడిఏ పి ఓ చిత్రా మిశ్రా, జిల్లా ఫారెస్ట్ అధికారి అనూజ్ అగర్వాల్ పాల్గొని ఇందిరా సౌర గిరి జలవికాసం పై సమీక్షించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్వోఎఫ్ ఆర్ కింద గిరిజనులకు కేటాయించిన భూములలో సాగుచేసేందుకు ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గిరిజనుల సమగ్ర వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమం అని వారు పేర్కొన్నారు. ఈ పథకం ముఖ్యంగా అటవీ హక్కుల చట్టం (RoFR) కింద భూములు పొందిన గిరిజన రైతులకు సాగునీరు, విద్యుత్, ఉద్యాన పంటల సాగు వంటి సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఐటిడిఏ పీ ఓ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం (RoFR) కింద భూములు పొందిన గిరిజన రైతులు పోడు భూములపై సాగు చేసే గిరిజన




రైతులను ఎంపిక చేయుటలో కమిటీ ఏర్పాటు చేసి మండల స్థాయిలో 9 మంది సభ్యులతో కూడిన కమిటీ లబ్ధిదారులను గుర్తిస్తుందని, ఈ కమిటీలో ఎంపీడీవో, వ్యవసాయ అధికారి, అటవీ శాఖ అధికారి, ఐటీడీఏ ప్రతినిధి, స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటారని వారు పేర్కొన్నారు. జిల్లాలో 212 మంది రైతులకు గాను 584 ఎకరాల భూమి ఉందని జిల్లా వ్యాప్తంగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించడానికి ప్రత్యేక సర్వేలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని ఈ పథకం యొక్క లక్ష్యాలు 5 HP నుండి 7.5 HP సామర్థ్యంతో కూడిన సౌర పంపు సెట్లు ఉచితంగా అందించడం, బోరు బావులు తవ్వించడం డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు ఉద్యాన పంటల సాగుకు అవసరమైన మొక్కలు ఉచితంగా పంపిణీ చేసి సాగు రైతులకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూతనంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని వారు పేర్కొన్నారు. పథకం అమలుకు వ్యవసాయ, ఉద్యానవన, అటవీ, నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య డిఆర్డిఓ కౌసల్యాదేవి జెడ్పి సీఈవో రామ్ రెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిపిఓ కల్పన, ఆర్టీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఇన్స్పెక్టర్ ల బదిలీ

### కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ గా పి వెంకన్న

**హన్మకొండ మహా;** వరంగల్ కమిషనరేట్ పరిధి లోని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ గా పనిచేస్తున్న నాగబాబు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీస్ స్టేషన్ కు బదిలీ కాగా యాంటీ హ్యూమన్ ట్రాఫింగ్ విభాగంలో ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్న పి. వెంకన్నను కాజీపేట్ ట్రాఫిక్ బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్ స్పెక్టర్ గా సోమవారం పి. వెంకన్న బాధ్యతలు చేపట్టారు.

## రానున్న వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**హన్మకొండ మహా;** రానున్న వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో వరద ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులు రానున్న వర్షాకాలంలో ఆయా శాఖల తరపున తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో ముంపు ప్రాంతాలను అధికారులు ముందస్తుగా గుర్తించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో తీసుకోవలసిన చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. రోడ్లు తెగిపోయే ప్రాంతాలను ఆ శాఖ అధికారులు ముందస్తుగానే గుర్తించాలన్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాలలో వర్షపు నీరు కారణంగా రాకపోకలకు ఇబ్బందికరంగా మారే ప్రాంతాలను గుర్తించాలన్నారు. చెరువులు, వాగుల స్థితిని ఎప్పటికప్పుడు శాఖ అధికారులు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. వాగులు పారే ప్రాంతాలను అధికారులు గుర్తించాలని, వాటిని సంబంధిత మండలాల తహసీల్దారులు పర్యవేక్షించాలన్నారు. ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పునరుద్ధరణ చర్యలు తీసుకునే విధంగా పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు విపత్తు నిర్వహణ సంబంధించిన ఉపకారణాలను సిద్ధంగా ఉంచాలని, బోట్స్, లైఫ్ జాకెట్స్, దివాటరింగ్ పంపు సిద్ధంగా ఉంచాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత భవనాలను అధికారులు ముందస్తుగా గుర్తించాలన్నారు. తగిన సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సరిపోను మందులు నిల్వలు ఉంచాలని పేర్కొన్నారు. వ్యాధులు ప్రభలే అవకాశాలున్నచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించేలా సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిపి సలీమా, ఇన్చార్జి కలెక్టర్ వై వి గణేష్, మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, డీఏవో రవీందర్ సింగ్, డిపిఓ లక్ష్మి రమా కాంత్, డిఎంహెచ్ఓ అప్పయ్య, ఆర్డిఓ కే నారాయణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు



ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ | 27-05-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM


## భారత్‌లో స్టార్‌లింక్ సర్వీస్..
# ధరలు ఇలా..

ఎలాన్ మస్క్ తన శాటిలైట్ ఇంటర్నెట్ 'స్టార్‌లింక్' కార్యకలాపాలను భారతదేశంలో ప్రారంభించనున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. కాగా ఈ సేవలు మనదేశంలో త్వరలోనే ప్రారంభం కానున్నాయని.. కొన్ని మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (DoT) నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ పొందిన స్టార్‌లింక్ చార్జీలు ఎలా ఉండబోతున్నాయంటే.. భారతదేశంలో స్టార్‌లింక్ సర్వీస్ ప్రారంభమైన తరువాత.. దీని ఛార్జీలు నెలకు 10 డాలర్ల (రూ.850) వరకు ఉండే అవకాశం ఉంది. ఈ ధరలు ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే.. చాలా తక్కువే అని తెలుస్తోంది. పరిచయ ఆఫర్లతో భాగంగా సంస్థ అపరిమిత డేటాను అందించే అవకాశం ఉంది. భారతదేశంలో వినియోగదారుల సంఖ్యను గణనీయంగా పెంచుకోవడానికి సంస్థ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే పరిచయ ఆఫర్స్ కూడా చాలా తక్కువ ధరకే అందించాలని యోచిస్తోంది. 10 మిలియన్స్ సబ్‌స్క్రైబర్‌లను లక్ష్యంగా చేసుకుని సంస్థ ముందడుగు వేస్తోంది. సబ్‌స్క్రైబర్లు స్టార్‌లింక్ హార్డ్‌వేర్ ప్యాకేజీని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందులో శాటిలైట్ డిష్, వైఫై రూటర్ వంటివి ఉన్నాయి. దీని కోసం ఎంత చెల్లించాలనే విషయం వెల్లడికాలేదు. ప్రపంచవ్యాప్తంగా.. స్టార్‌లింక్ సేవలు చాలా ఖరీదైనవిగా ఉన్నాయి. యునైటెడ్ స్టేట్స్‌లో, రెసిడెన్షియల్ లైట్ ప్లాన్ నెలకు దాదాపు 80 డాలర్లు (రూ. 6,800). అయితే కస్టమర్‌లు 349 డాలర్లతో (రూ. 29,700) వన్ టైమ్ రుసుముతో స్టార్‌లింక్ స్టాండర్డ్ కిట్‌ను కూడా కొనుగోలు చేయాలి.




# ధర ఎక్కువైనా.. మూడు లక్షల మంది కొనేశారు




టయోటా కంపెనీ భారతదేశంలో ఫార్చ్యూనర్ కార్లను ఏకంగా మూడు లక్షల యూనిట్లను విక్రయించింది. 2009లో ప్రారంభమైన ఈ కారు ఆ తరువాత కాలంలోనే అనేక అప్డేట్స్ పొందుతూ వచ్చింది. ఇందులో భాగంగానే.. 2021లో లెజెండర్ వేరియంట్ విడుదలైంది. అంతకంటే ముందు ఫేస్‌లిఫ్ట్ వేరియంట్స్ కూడా లాంచ్ అయ్యాయి. ఫార్చ్యూనర్ ప్రస్తుతం 2.8 లీటర్ డీజిల్, 2.7 లీటర్ పెట్రోల్ అనే రెండు ఇంజన్ ఎంపికలలో అందుబాటులో ఉంది. డీజిల్ వేరియంట్ 6 స్పీడ్ మాన్యువల్ లేదా 6 స్పీడ్ ఆటోమాటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలను పొందుతాయి. పెట్రోల్ వేరియంట్ 5 స్పీడ్ మాన్యువల్ లేదా 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్స్ పొందుతుంది. లెదర్ సీట్లు, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, క్రూయిజ్ కంట్రోల్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఆండ్రాయిడ్ ఆటో & ఆపిల్ కార్ప్లే కనెక్టివిటీతో కూడిన 8 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, జేబీఎల్ స్పీకర్లు, డ్రైవింగ్ మోడ్‌లు (ఎకో, నార్మల్, స్పోర్ట్), పార్క్ అసిస్ట్ వంటి ఫీచర్స్ ఫార్చ్యూనర్ కారులో ఉన్నాయి. టయోటా ఫార్చ్యూనర్ ధరల విషయానికి వస్తే.. పెట్రోల్ 4x2 AT వేరియంట్ ధర రూ. 35.37 లక్షలు. డీజిల్ వేరియంట్ ధర 4x2 MT ధర రూ. 36.33 లక్షల నుంచి రూ. 51.94 లక్షల (టాప్‌స్పెక్ 4x4 AT GRS వెర్షన్) వరకు ఉంటుంది. అదే సమయంలో.. లెజెండర్ వేరియంట్ ధర రూ. 44.11 లక్షల నుంచి రూ. 48.09 లక్షల (అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్) వరకు ఉంటుంది.

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



సోమవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 455.38 పాయింట్లు లేదా 0.56 శాతం లాభంతో.. 82,176.45 వద్ద, నిఫ్టీ 148.00 పాయింట్లు లేదా 0.60 శాతం లాభంతో 25,001.15 వద్ద నిలిచాయి. శ్రేయాన్స్ ఇండస్ట్రీస్, ఖైతాన్ (ఇండియా), ఎక్సారో టైల్స్, ఓరియంటల్ కార్బన్ అండ్ కెమికల్స్, వాక్స్‌టెక్స్ కాట్‌ఫ్యాబ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఫేజ్ త్రీ, సాల్జర్ ఎలక్ట్రానిక్స్, కమర్షియల్ సిన్ బ్యాగ్స్, పిక్స్ ట్రాన్స్‌మిషన్స్, ఎమ్బి ఇండస్ట్రీస్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

## జీతం తక్కువైనా చాలు.. కానీ..



జీవన వ్యాయాలు పెరిగిపోతున్న తరుణంలో వేతన జీవుల అంచానాలు, ఆకాంక్షలు మారిపోతున్నాయి. 74 శాతం మంది ఉద్యోగులు వేతనాల కంటే కూడా బలమైన దీర్ఘకాలిక ప్రయోజనాలతో కొంచెం తక్కువ వేతనానికి మొగ్గుచూపుతున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. హెల్త్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ ప్లానింగ్, ఎడ్యుకేషన్ సపోర్ట్ వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలకు బదులుగా కొంచెం తక్కువ వేతనాన్ని ఎంచుకుంటామని సర్వేలో పాల్గొన్న ఉద్యోగుల్లో 74 శాతం మంది పేర్కొన్నట్లు స్టాఫింగ్ సొల్యూషన్స్, హెచ్‌ఆర్ సర్వీసెస్ ప్రొవైడర్ జీనియస్ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడించింది.

జీనియస్ కన్సల్టెంట్స్ దేశవ్యాప్తంగా 1,139 మంది ఉద్యోగుల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ప్రస్తుతం కేవలం 32 శాతం మంది ఉద్యోగులు మాత్రమే తమ ప్రస్తుత ప్రయోజనాల ప్యాకేజీ తమ ఆర్థిక శ్రేయస్సుకు తోడ్పడుతుందని భావించగా, 61 శాతానికి పైగా తమ ప్రయోజనాలు సరిపోవని చెప్పారు.

తమ యాజమాన్యాలు ఉద్యోగుల మానసిక, ఆర్థిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని 54 శాతం మంది చెప్పారు. హైబ్రిడ్ లేదా రిమోట్ అరేంజ్మెంట్స్ వంటి సౌకర్యవంతమైన పని ఎంపికలు తమకు ఆర్థికంగా కొంతమేర ఊరట కల్పిస్తాయని 84 శాతం మంది పేర్కొన్నారు. పనితీరు ఆధారిత బోనస్‌లు, ప్రోత్సాహకాలు వారి ప్రస్తుత ఆర్థిక ఆందోళనలను గణనీయంగా తగ్గిస్తాయని 73 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ఇది వ్యక్తిగత పనితీరుకు ప్రతిఫలం ఇచ్చే, ఆదాయ అంతరాలను పూడ్చడానికి సహాయపడే వేరియబుల్ పరిహారానికి పెరుగుతున్న ప్రాధాన్యతను వెల్లడించింది.


# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## వెయ్యిదాటిన కేసులు.. దేశమంతటా అప్రమత్తం



**న్యూఢిల్లీ:** దేశంలో కోవిడ్19 కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. 2020 నుండి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్న అంటు వ్యాధి తిరిగి దేశంలో అంతకంతకూ ప్రభలుతోంది. తాజాగా దేశవ్యాప్తంగా మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,009కి చేరిందని కేంద్ర కోవిడ్ నియత్రణ విభాగం తెలియజేసింది. ప్రస్తుతం రాజధాని ఢిల్లీలో 104 యాక్టివ్ కేసులు ఉండగా, వాటిలో 99 కేసులు గత వారంలోనే నమోదయ్యాయి. మహారాష్ట్రలో ఆదివారం కొత్తగా 43 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 209కి చేరింది. ముంబైలో కొత్తగా 35 కేసులు నమోదు కాగా, పూణేలో కొత్తగా ఎనిమిది కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో జనవరి నుంచి ఇప్పటివరకూ మొత్తం 300 కోవిడ్19 కేసులు నమోదయ్యాయి. ఒక్క ముంబైలోనే 248 కేసులు నమోదయ్యాయి. ఇది రాష్ట్రంలోని మొత్తం ఇన్ఫెక్షన్లలో 82.67 శాతం. మరోవైపు దేశవ్యాప్తంగా కోవిడ్19 కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. కేరళ(Kerala)లో అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. తరువాత స్థానంలో తమిళనాడు, మహారాష్ట్ర ఉన్నాయి. ఢిల్లీలో కూడా నమోదవుతున్న కేసులలో స్వల్ప పెరుగుదల కనిపించింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం నమోదైన కేసుల్లో ఎక్కువ భాగం తేలికపాటివి. వీటికి గృహ సంరక్షణలో చికిత్స అందిస్తున్నారు. సింగపూర్, హాంకాంగ్ తదితర దేశాల్లో కోవిడ్19 కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో నమోదువున్న కేసుల విషయంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ(Union Ministry of Health) అప్రమత్తంగా ఉందని, పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దేశంలో కొత్తగా కోవిడ్19 వేరియంట్ ఎన్‌బీ.1.8.1కు చెందిన ఒక కేసు, ఎల్ఎఫ్.7కి చెందిన నాలుగు కేసులను గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 సబ్‌వేరియంట్‌లను 'వేరియంట్స్ అండర్ మానిటరింగ్' (వీయూఎం)లుగా వర్గీకరించింది. వేరియంట్స్ ఆఫ్ కన్సర్న్ (వీఓసీ) లేదా వేరియంట్స్ ఆఫ్ ఇంటరెస్ట్ (వీఓఐ)గా పేర్కొంది. చైనా, ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో కోవిడ్19 కేసుల పెరుగుదలకు కారణమైన వేరియంట్‌లు ఇవేనని తెలిపింది. దేశంలో ప్రస్తుతం అత్యంత సాధారణ వేరియంట్ జేఎన్.1 వ్యాప్తిలో ఉంది. తరువాత బీఏ.2 (26శాతం), ఇతర ఓమిక్రాన్ సబ్‌లైనేజ్‌లు (20శాతం) ఉన్నాయి.


ప్రస్తుతం కోవిడ్19 కేసులతో పోరాడుతున్న రాష్ట్రాల జాబితాలో కేరళ 430 కేసులతో అగ్రస్థానంలో ఉంది. తరువాత 209 కేసులతో మహారాష్ట్ర రెండవ స్థానంలో ఉంది. ఢిల్లీ మూడవ స్థానంలో ఉంది. గుజరాత్‌లో 83 కేసులు, కర్ణాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 12 కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో నాలుగు, కేరళలో రెండు, కర్ణాటకలో ఒకటి చొప్పున కోవిడ్19 మరణాలు నమోదయ్యాయి. ఇప్పటివరకూ అండమాన్, నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌లలో ఎటువంటి యాక్టివ్ కేసులు నమోదు కాలేదు.



## అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌ను ముంచెత్తిన వరద నీరు

**ముంబై:** ముంబై మునిగింది. దేశ ఆర్థిక రాజధాని వర్షాలతో అతలాకుతలమైంది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాత్రి నుంచి ముంబైలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముంబై మహానగరానికి వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కుండపోతవానకు నగరం నరకంలా మారింది. రవాణా స్తంభించిపోయింది. రోడ్లు చెరువుల్లా మారడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాక్‌లపైకి వాన నీరు చేరడంతో రైల్వే సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. మే 10న ప్రారంభమైన వర్లీ మెట్రో స్టేషన్‌కు వరదనీరు పోటెత్తింది. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ట్రైన్ వచ్చే వరకు, వచ్చిన తర్వాత ట్రైన్ లోపలికి వెళ్లేందుకు వినియోగించే స్టేషన్ గేట్ల వరకు మాత్రమే కాకుండా ప్లాట్‌ఫామ్‌లను నీరు ముంచెత్తింది. వెలుగులోకి వచ్చిన ఆ వీడియోల్లో ప్లాట్ ఫామ్ పూర్తిగా బురద నీటితో నిండిపోయి ఉండటాన్ని చూడొచ్చు. అంతేకాదు, మెట్రో లోపల తీసిన మరో వీడియోలో పైకప్పులో లీకేజీ కారణంగా ప్లాట్‌ఫారమ్‌పై నుండి నీరు ప్రవహించింది. భారీ ఎత్తున నీరు నిలిచిపోవడంతో మెట్రో సర్వీసులకు ఆటంకం ఏర్పడింది. అయితే, అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో వరదకు కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమే కారణమని తెలుస్తోంది. ముంబై మూడు లైన్ల అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్‌ను బాంద్రాకుర్లా కాంప్లెక్స్ (BKC) నుండి వర్లిలోని ఆచార్య అత్రే చౌక్ వరకు సేవల్ని అందిస్తోంది. ఈ మెట్రో సేవలు ఈ నెల ప్రారంభంలో మే 10న అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలే ప్రారంభమైన మెట్రో స్టేషన్‌ను వరద నీరు ముంచెత్తడంతో మౌలిక సదుపాయాల గురించి ప్రశ్నలు తలెత్తాయి.

## నంబాల ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టులు లేఖ



**ఢిల్లీ:** మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. మావోయిస్టు జోనల్ కమిటీ పేరుతో లేఖ విడుదలైంది. ఆ లేఖలో నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన కారణాల్ని అందులో పేర్కొన్నారు. 'లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారంతో ఎన్ కౌంటర్ జరిగింది. 6నెలలుగా కేశవరావు మాడ్ ప్రాంతంలో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు తెలుసు. కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరుగురు ఇటీవలే లొంగిపోయారు. వాళ్లు ఇచ్చిన సమాచారంతో ఎన్ కౌంటర్. యూనిఫైడ్ కమాండో సభ్యుడు దేశ ద్రోహిగా మారాడు. రికీతో సహా పలువురు ద్రోహం చేయడంతో ఈ ఎన్ కౌంటర్. ఎన్‌కౌంటర్ ముందు రోజు నుంచి 20వేల మంది బలగాలు మా ప్రాంతాన్ని చుట్టి ముట్టాయి. 10 గంటల్లో ఐదు ఎన్ కౌంటర్లు జరిపాయి. 60 గంటల పాటు బలగాలు మమ్మల్ని నిర్బంధించాయి. కేశవరావుని కాపాడుకునేందుకు 35మంది ప్రాణాల్ని అడ్డుపెట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సురక్షింతంగా బయటపడ్డారు. నంబాలను సజీవంగా పట్టుకుని ఎన్ కౌంటర్ చేశారు. మమ్మల్ని వదిలి కేశవరావును సురక్షిత ప్రాంతాన్ని తరలించేందుకు ప్రయత్నించాం. కానీ మమ్మల్ని వదిలి కేశవరావు బయటకు వెళ్లేందుకు ఒప్పుకోలేదు. నాయకత్వాన్ని ముందుండి మాతోటే నడిచారు. ప్రాణాల్ని ఫణంగా పెట్టారు. మా నాయకుడిని కాపాడు కోవడంలో మేం విఫలమయ్యాం. కాల్పులు విరణమకు అంగీకరించాం. కాల్పులు జరపలేదు. కానీ కేంద్రం మాతో చర్చలు జరిపేందుకు అంగీకరించలేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

## జడ్జి నోట్ల కట్టల వ్యవహారం.. ఆ లేఖలో వివరాలను బహిర్గతం చేయలేం

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ 'నోట్ల కట్టల' వ్యవహారంలో ఇవాళ కీలక మలుపు చోటు చేసుకుంది. కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న టైంలో ఆయన అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా.. మంటలర్పిన ఫైర్, పోలీస్ పోలీస్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం, ఆ వ్యవహారం బయటకు పొక్కడం సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై కోర్టు నియమించిన కమిటీ విచారణ జరిపి నివేదికను అందజేసింది కూడా. అయితే.. అందులో విషయాలను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు అందింది. అయితే సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్(CPIO) ఈ దరఖాస్తును తిరస్కరిస్తూ.. ఆర్టీఐ యాక్ట్‌లోని సెక్షన్ 8(1)(e) కింద సమాచారం అందించలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో 2019 సంచలన తీర్పును న్యాయస్థానం ప్రస్తావించింది. సుభాష్ చంద్ర అగర్వాల్ కేసులో.. రాజ్యాంగ పరిధిలో గోప్యత హక్కు, సమాచార హక్కు ఈ రెండింటి సమతుల్యత అవసరమని కోర్టు వ్యాఖ్యానించింది. మార్చి 14వ తేదీన జడ్జి ఊళ్లో లేని టైంలో బంగ్లాలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుని కాలిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో ఆయన్ని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే అలహాబాద్ బార్ అసోషియేషన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. బదిలీ చేసినప్పటికీ విధులేవీ ఆయనకు అప్పగించలేదు. అంతేకాదు.. మునుపెన్నడూ లేని రీతిలో ఆ ఇంట్లో బయటపడ్డ నోట్ల కట్టల ఫొటోలు, వీడియోలను సుప్రీం కోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఆసక్తికర చర్చకు దారి తీసింది. అటుపై మార్చి 22వ తేదీన జడ్జి వర్మ నోట్ల కట్టల వ్యవహారంపై అంతర్గత విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 3వ తేదీన తుది నివేదిక రూపొందించగా.. ఆ మరుసటి రోజు ఆనాడు సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నాకు నివేదిక అందజేసింది. దానిని సీజేఐ ఓ లేఖ ద్వారా రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి తెలియజేశారు. మరోవైపు తనపై వస్తున్నవి కేవలం ఆరోపణలేనని జస్టిస్ వర్మ మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు.



08



# మహా పత్రిక




WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 27-05-2025

తెలుగు

# సెప్టెంబరులో ఓజీ

పవన్‌కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ'. ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇమ్రాన్ హష్మి ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోందని తెలిసింది. కాగా 'ఓజీ'ని ఈ ఏడాది సెప్టెంబరు 25న విడుదల చేయనున్నట్లుగా ఆదివారం మేకర్స్ వెల్లడించారు. శ్రియా రెడ్డి, అర్జున్ దాస్ ఇతర కీలకపాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: తమన్.





# క్రేజీ థ్రిల్లర్ మూవీ.. ఓటీటీలో డైరెక్ట్ రిలీజ్

ఓటీటీలో థ్రిల్లర్ సినిమాలకు డిమాండ్ ఎక్కువ. భాషతో సంబంధం లేకుండా చూస్తుంటారు. అందుకు తగ్గట్లే దర్శకులు కూడా డిఫరెంట్ స్టోరీలతో ఈ తరహా మూవీస్ తీస్తుంటారు. అలా ఇప్పుడు ఓ హిందీ చిత్రం.. గతంలో పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు దీన్ని నేరుగా ఓటీటీలో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మీర్జాపుర్, పాతాళ్ లోక్ తదితర వెబ్ సిరీసులతో అభిషేక్ బెనర్జీ ఫేమ్ తెచ్చుకున్నాడు. ఇతడు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'స్టోలెన్'. దీన్ని జూన్ 4వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఓ టీజర్ కూడా రిలీజ్ చేశారు. చూచాయిగా స్టోరీ ఏంటనేది బయటపెట్టారు. స్టోలెన్ విషయానికొస్తే.. ఓ రైల్వే స్టేషన్‌లో ఉన్న తల్లి దగ్గరున్న పాపని దుండగులు ఎత్తుకుపోతారు. దీన్ని చూసిన గౌతమ్, రామన్ అనే అన్నదమ్ములు.. ఆ పాపని వెతికిపెట్టాలని నిర్ణయించుకుంటారు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు? చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది. ఇకపోతే ఈ వారం ఓటీటీల్లో రిలీజయ్యే సినిమాల విషయానికొస్తే.. దాదాపు 14 కొత్త చిత్రాలు-వెబ్ సిరీసులు స్ట్రీమింగ్ కాబోతున్నాయి. వీటిలో హిట్ 3, రెట్రో, అజ్ఞాతవాసి అనే కన్నడ సినిమా చూడదగ్గ వాటిలో ఉన్నాయి. వీటితో పాటు మరికొన్ని సడన్ రిలీజయ్యే ఛాన్సులు కూడా ఉన్నాయి.

# సంక్రాంతి బరిలో నవీన్ పొలిశెట్టి..



యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం అనగనగా ఒక రోజు. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా గుంటూరు కారం భామ మీనాక్షి చౌదరి కనిపించనుంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రానికి సంబంధించిన బిగ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ వీడియోను షేర్ చేశారు. ఈ సంక్రాంతికి దద్దరిల్లే నవ్వులని ఆనందాన్ని తీసుకొస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి 14న ఈ మూవీ థియేటర్లలో సందడి చేయనుంది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి మూవీ తర్వాత నవీన్ పోలిశెట్టి నటిస్తోన్న చిత్రం ఇదే కావడం విశేషం. ఇప్పటికే విడుదలైన ప్రీ వెడ్డింగ్ టీజర్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. కాగా.. ఈ సినిమాకి మిక్కీ జే మేయర్ సంగీతమందిస్తున్నారు.




# నా సినిమాని నేనే పైరసీ చేసుకుంటానా?

ప్రస్తుతం టాలీవుడ్‌లో థియేటర్ల సమస్య నడుస్తోంది. థియేటర్ల యజమానులు, సినిమాలు తీస్తున్న నిర్మాతల మధ్య పర్సంటేజ్ విషయమై ఎడతెగని చర్చలు జరుగుతున్నాయి. దీన్ని కాసేపు అలా పక్కనబెడితే రెండు రోజుల క్రితం పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్ పెట్టగా.. నిర్మాత అల్లు అరవింద్ నిన్న ప్రెస్ మీట్ పెట్టారు. ఇప్పుడు సోమవారం.. దిల్ రాజు మీడియా ముందుకొచ్చారు. సినిమా ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదేనని దిల్ రాజు అన్నారు. ఇండస్ట్రీలో సమన్వయం లేదని, ఎవరికీ తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని చెప్పుకొచ్చారు. 250 థియేటర్లు ఓనర్స్, వాళ్లకు సంబంధించిన వాళ్లు మాత్రమే నడుపుతున్నారు. 'ఆ నలుగురు' అంటూ మీడియా ఇష్టమొచ్చినట్లు రాస్తోందని, అందుకే ఈ విషయమై క్లారిటీ ఇద్దామని ఇప్పుడు మాట్లాడుతున్నానని దిల్ రాజు స్పష్టం చేశారు. ఇదే ప్రెస్ మీట్‌లో మాట్లాడిన దిల్ రాజు.. గేమ్ ఛేంజర్ పైరసీ కావడం, ఓ నిర్మాత చేసిన కామెంట్స్ గురించి చెప్పుకొచ్చారు. 'గేమ్ ఛేంజర్ విడుదలైన రోజే పైరసీ ప్రింట్ వచ్చింది. కానీ ఓ మాజీ నిర్మాత.. ప్రొడ్యూసరే ఈ సినిమాని కావాలనే పైరసీ చేశాడని అన్నాడు. ఇది ఎంత నీచం? నా సినిమా నేను కాపాడుకుంటాను కానీ పైరసీ చేసుకుంటానా? కొంతమంది చాలా నీచంగా బిహేవ్ చేస్తున్నారు. గేమ్ ఛేంజర్ సినిమాని నేను పైరసీ చేసుకుంటానా? పైరసీ చేస్తే ప్రొడ్యూసర్‌గా నాకు నష్టం కాదా? డిస్ట్రిబ్యూటర్‌కు నష్టం కాదా? బుద్ధి ఉన్నోడు ఎవడైనా తన ఇంట్లో మనిషిని చంపుకుందాం అనుకుంటాడా?' అని దిల్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన గేమ్ ఛేంజర్ సినిమా.. దారుణమైన డిజాస్టర్ అయింది. తొలిరోజే ఘనంగా రూ.186కోట్ల కలెక్షన్స్ అని పోస్టర్ రిలీజ్ చేశారు గానీ దీనిపై విపరీతమైన ట్రోల్స్ వచ్చాయి. రిలీజైన ఇన్నాళ్లు అవుతున్నాసరే ఏదోలా మీడియాలో హాట్ టాపిక్ అవుతూనే ఉంది. ఇప్పుడు స్వయంగా చిత్ర నిర్మాత దిల్ రాజు కూడా తను ఎదుర్కొన్న బాధని బయటపెట్టారు.



## క్రీడా వార్తలు | SPORTS NEWS



## రిటైర్మెంట్ ప్రకటించిన భారత క్రికెటర్



ఇండియా-ఎ జట్టు మాజీ కెప్టెన్, గుజరాత్ స్టార్ బ్యాటర్ ప్రియాంక్ పంచల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అన్ని రకాల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని సోమవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు కొనసాగిన తన దేశవాళీ కెరీర్‌కు ముగింపు పలికాడు.

# విధ్వంసం సృష్టించిన ఇంగ్లిస్, ఆర్య..
# ముంబైపై పంజాబ్ గ్రాండ్ విక్టరీ

ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (మే 26) జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ సాధించింది.ఈ గెలుపుతో పంజాబ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకి, టాప్2లో స్థానాన్ని ఖరారు చేసుకుంది. ఈ ఓటమితో ముంబై నాలుగో స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

**పాయింట్ల పట్టికలో ప్లే ఆఫ్స్‌కు చేరిన జట్లు..**

పంజాబ్ 19
గుజరాత్ 18
ఆర్సీబీ 17 (ఇంకా ఓ మ్యాచ్ ఆడాల్సి ఉంది)
ముంబై 16

### సత్తా చాటిన సూర్యకుమార్

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన సూర్యకుమార్ మెరుపు అర్ధ సెంచరీతో (57) సత్తా చాటాడు. ముంబై ఇన్నింగ్స్‌లో రికెల్టన్ 27, రోహిత్ శర్మ 24, తిలక్ వర్మ 1, విల్ జాక్స్ 17, హార్దిక్ పాండ్యా 26, నమన్ ధిర్ 20 పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో జన్సెన్, విజయ్‌కుమార్ వైశాఖ్, అర్షదీప్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. హర్ప్రీత్ బ్రార్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

**విధ్వంసం సృష్టించిన ఇంగ్లిస్, ప్రియాంశ్**

అనంతరం 185 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పంజాబ్.. 18.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. ప్రియాంశ్ ఆర్య 62, జోష్ ఇంగ్లిస్ 73, శ్రేయస్ అయ్యర్ 26 (నాటౌట్), ప్రభ్‌సిమ్రన్ 13, నేహాల్ వధేరా 2 (నాటౌట్) పరుగులు చేశారు. ముంబై బౌలర్లలో సాంట్నర్ 2, బుమ్రా ఓ వికెట్ పడగొట్టారు.



## చరిత్ర సృష్టించిన సూర్యకుమార్ యాదవ్



ముంబై ఇండియన్స్ స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో రెండు సీజన్లలో 600, అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి ముంబై ఇండియన్స్ ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. 2023 సీజన్‌లో తొలిసారి 600 ప్లస్ మార్కును (605) తాకిన స్కై.. ప్రస్తుత సీజన్‌లో కూడా 600 పరుగుల మైలురాయిని దాటాడు. ముంబై ఇండియన్స్ చరిత్రలో (ఐపీఎల్‌లో) స్కై కాకుండా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మాత్రమే ఓసారి 600 ప్లస్ పరుగులు స్కోర్ చేశాడు. సచిన్ 2010 సీజన్‌లో 618 పరుగులు సాధించాడు.

**ఓ ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు..**

619* సూర్యకుమార్ యాదవ్ (2025)
618 సచిన్ టెండూల్కర్ (2010)
605 సూర్యకుమార్ యాదవ్ (2023)
553 సచిన్ టెండూల్కర్ (2011)
540 లెండిల్ సిమన్స్ (2015)
538 రోహిత్ శర్మ (2013)

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఇవాళ (మే 26) జరుగుతున్న మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ 600 పరుగుల మార్కును దాటాడు. ఈ మ్యాచ్‌లో 44 పరుగుల వద్ద (16 ఓవర్ల తర్వాత) బ్యాటింగ్ చేస్తున్న స్కై.. ఈ సీజన్‌లో 14వ సారి 25 పరుగుల మార్కును దాటాడు. ఐపీఎల్ చరిత్రలో ఓ బ్యాటర్ ఇన్ని సార్లు (ఒకే సీజన్‌లో) 25 పరుగుల మార్కును దాటడం ఇదే మొదటిసారి. 2018 సీజన్‌లో కేన్ విలియమ్సన్, 2023 సీజన్‌లో శుభ్‌మన్ గిల్ 13 సార్లు ఈ ఘనత సాధించారు. మ్యాచ్ విషయానికొస్తే.. పంజాబ్‌తో మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న ముంబై ఇండియన్స్ 16.3 ఓవర్ల తర్వాత 5 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుంది. సూర్యకుమార్ యాదవ్ 44, నమన్ ధిర్ 0 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ముంబై ఇన్నింగ్స్‌లో రికెల్టన్ 27, రోహిత్ శర్మ 24, తిలక్ వర్మ 1, విల్ జాక్స్ 17 పరుగులు చేసి ఔటయ్యారు. పంజాబ్ బౌలర్లలో జన్సెన్, విజయ్‌కుమార్ వైశాఖ్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. హర్ప్రీత్ బ్రార్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

# చరిత్ర సృష్టించిన ఆర్సీబీ.. తొలి ఐపీఎల్ జట్టుగా

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురుంచి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్‌ను సొంతం చేసుకోపోయినప్పటికి.. ఆర్సీబీని అభిమానించే వాళ్లు కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో బెంగళూరు ఓ డిజిటల్ మైలురాయిని అందుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీగా బెంగళూరు అవతరించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఆరంభంలో ఆర్సీబీ ఇన్‌స్టా ఫాలోవర్ల సంఖ్య 18 మిలియన్లగా ఉండేది. ఇప్పుడు కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఆ సంఖ్య 20 మిలియన్లకు చేరింది. ఈ క్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ (18.6 మిలియన్లు), ముంబై ఇండియన్స్ (18 మిలియన్లు)లను బెంగళూరు ఫ్రాంచైజీ దాటిసేంది. ఇక ఈ ఏడాది సీజన్‌లో ఆర్సీబీ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. టాప్2 స్థానం కోసం ప్రయత్నిస్తోంది. ఆర్సీబీకి ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉంది. మే 27న ఏకానా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో బెంగళూరు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ విజయం సాధిస్తే పాయింట్ల పట్టకలో టాప్2 స్థానానికి చేరుకుంటుంది. ఇప్పటివరకు 13 మ్యాచ్‌లు ఆడిన రాయల్ ఛాలెంజర్స్.. ఎనిమిదింట విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా ఫాలో అవుతున్న ఐపీఎల్ జట్లు ఇవే:**

- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) 20 మిలియన్లు
- చెన్నై సూపర్ కింగ్స్ (CSK) 18.6 మిలియన్లు
- ముంబై ఇండియన్స్ (MI) 18 మిలియన్లు
- కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) 7.5 మిలియన్లు
- సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) 5.4 మిలియన్లు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com